బుధవారం
25-12-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 94
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం


## డబ్ల్యుహెచ్‌ఓను వీడనున్న అమెరికా!

లండన్: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) నుంచి అమెరికా వైదొలగడానికి కసరత్తు జరుగుతోందని ఆరోగ్య రంగ నిపుణులు తెలిపారు. ఇందుకోసం డొనాల్డ్ ట్రంప్ బృందం చర్యలు తీసుకుంటోందని హెచ్చరించారు. ఇది జరిగితే ప్రపంచ ఆరోగ్య వ్యవస్థపై ప్రభావం తీవ్రంగా ఉంటుందని వారన్నారు. 2025, జనవరి 20న ట్రంప్ అధ్యక్ష పగ్గాలు చేపట్టే రోజే ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తారని ఆయన బృందం చెప్పినట్లు తెలుస్తోంది. అమెరికా నిష్క్రమిస్తే డబ్ల్యుహెచ్‌ఓకు నిధుల కొరత ఏర్పడి...కోవిడ్ తరహా పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిధుల కొరత కారణంగా డబ్ల్యుహెచ్‌ఓ తన శాస్త్రీయ బృందాన్ని తగ్గించుకోక తప్పబోదని జార్జ్ టౌన్ లా ప్రొఫెసర్ గాస్టిన్ అంచనా వేశారు.

## కొనసాగుతున్న అల్పపీడనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నైరుతి బంగాళా ఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దక్షిణకోస్తా, ఉత్తర తమిళనాడు తీరాల వెంబడి ఈ అల్పపీడనం కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో మంగళవారం తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. రాబోయే 24 గంటల్లో అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడనున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథ్‌కుమార్ వెల్లడించారు. నైరుతి

- మిగతా 2 లో

# సీపీఐ వందేళ్ల పండుగ

- రేపు విజయవాడలో ప్రారంభం
- జయప్రదం చేయాలని రామకృష్ణ పిలుపు
- 30న అమిత్‌షా రాజీనామా కోసం వామపక్షాల ఆందోళనలు
- రాష్ట్ర ప్రభుత్వం అదానీ విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసేవరకు పోరాడతామని వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి 99 ఏళ్లు పూర్తయి వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నదని, ఈ సందర్భంగా డిసెంబరు 26వ తేదీ నుంచి జరిగే సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలలో ప్రజలు భాగస్వాములై జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ శత వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా ఏడాది పాటు నిర్వహించాలని సీపీఐ జాతీయ సమితి నిర్ణయించిందన్నారు. డిసెంబరు 26వ తేదీన విజయవాడలో ప్రారంభమయ్యే ఈ వేడుకలు 2025 డిసెంబరు 26న తెలంగాణలోని ఖమ్మంలో జరిగే కార్యక్రమంతో ముగుస్తాయని చెప్పారు. జాతీయ సమితి నిర్ణయంలో భాగంగా

- మిగతా 2 లో



## రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

**బీజేపీపై భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు విమర్శలు**

**అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఖమ్మంలో కాంగ్రెస్ ర్యాలీ**

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: కేంద్ర హోంమంత్రి పదవిలో కొనసాగే నైతిక హక్కును అమిత్‌షా కోల్పోయారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా నిరసనలకు కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయం నుంచి జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ర్యాలీలో భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఇద్దరు నాయకులు మాట్లాడుతూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీన పరచాలని, దానిని మార్చివేయాలని బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గత ఐదేళ్లుగా చెబుతున్నది నిజమని అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలతో రుజువు అయిందని అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పరిపాలన చేపట్టి... దానిని ఉల్లంఘించిన కేంద్రప్రభుత్వాన్ని రద్దు చేయాలని రాష్ట్రపతిని కోరుతున్నట్లు తెలిపారు. రాజ్యాంగం అంటే ఈ దేశంలో పుట్టిన ప్రతి పౌరునికి సంబంధించినదని, కొద్ది మంది దళితులు, పేదలకు పరిమితం కాదని అన్నారు. అంబేద్కర్‌ను

- మిగతా 2 లో

## నల్లకన్ను 100వ జన్మదినం

**29న ఉత్సవాలు ప్రారంభించనున్న స్టాలిన్**

చెన్నై: సీపీఐ సీనియర్ నాయకుడు ఆర్.నల్లకన్ను నూరేళ్ల పండుగ చేసుకోనున్నారు. ఈనెల 26వ తేదీన ఆయన 100వ పుట్టినరోజు. దీనిని పురస్కరించుకొని శతాబ్ది ఉత్సవాలకు తమిళనాడు ముస్తాబవుతోంది. చెన్నైలోని కలైవనర్ అరాంగ్గమ్ ఇందుకు వేదిక కాగా ఈనెల 29న ఉత్సవాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభిస్తారు. 100 మంది కవులు రాసిన కవితల పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. నల్లకన్ను శత వసంతులు జరుపుకోవడం

- మిగతా 2 లో

# దేశంలో అప్రకటిత యుద్ధంపై చర్చ జరగాలి

- కార్పొరేట్ శక్తుల వల్లే మణిపూర్‌లో అంతర్యుద్ధం
- యాదవ్‌రెడ్డి నిబద్ధతకు మారుపేరు
- "నట్స్, బోల్ట్ ఆఫ్ వార్ అండ్ పీస్" పుస్తక ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మణిపూర్ అంతర్యుద్ధం సహా దేశంలో జరుగుతున్న అప్రకటిత యుద్ధంపై, నెలకొన్న భయానక వాతావరణంపై చర్చ జరగాలని, ప్రపంచ శాంతిని కోరుతున్న ఉద్యమకారులు ఈ విషయంపై ఆలోచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అఖిలభారత శాంతి, సంఘీభావ సంఘం(ఐప్సో) జాతీయ సలహా కమిటీ చైర్మన్ కొంపల్లి యాదవ్ రెడ్డి రచించిన "నట్స్, బోల్ట్ ఆఫ్ వార్ అండ్ పీస్" పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ ఆవిష్కరించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం సాయంత్రం జరిగిన పుస్తకావిష్కరణ సభకు ఐప్సో ప్రధాన కర్యాదర్శి మహ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ అధ్యక్షత వహించగా, ప్రపంచ శాంతి మండలి అధ్యక్షులు పల్లబ్ సేన్ గుప్తా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు బోయినిపల్లి వినోద్ కుమార్, వి.హనుమంతరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ఐప్సో జాతీయ ప్రిసీడియం కమిటీ సభ్యులు దిడ్డి సుధాకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీఎల్, నేతలు తిప్పర్తి యాదయ్య, ప్రీతి నిగం, సమత రోష్ని, ఎంవీ సుబ్బారావు, మెట్ల జగన్, కాచం సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ 2014 తరువాత దాదాపు 2వేల నుంచి 4వేల చదరపు కి.మీ వరకు భారత భూభాగం ఆక్రమణకు గురైందని... ఈ విషయంపై చర్చ చేసేందుకు పాలకులకు ధైర్యం లేదని, చర్చించే వారు అసలే లేరని పేర్కొన్నారు. మరోవైపు మణిపూర్ లో రెండు గిరిజన జాతులు ఎదురుపడుతే

- మిగతా 2 లో

# సినీరంగంలో విప్లవాత్మక మార్పు

- సెన్సార్ బోర్డుకు సంస్కరణలు అవసరం
- బౌన్సర్ వ్యవస్థ రద్దు అవశ్యం
- కూనంనేని సాంబశివరావు
- శ్రీతేజ్‌కు సీపీఐ నేతల పరామర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: సెన్సార్ బోర్డు ప్రక్షాళన, బౌన్సర్ వ్యవస్థ రద్దు, చిన్న సినిమాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నొక్కి చెప్పారు. చట్టానికి అందరూ సమానమేనని పుష్పా-2 వివాదం క్రమంలో వ్యాఖ్యానించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహా, కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, మందపవన్‌తో కలిసి ఆయన మంగళవారం కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి శ్రీతేజ్‌ను పరామర్శించారు. శ్రీతేజ్ త్వరగా కోలుకునేలా మరింత మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ సెన్సార్ బోర్డును సంస్కరించడం అవసరమని అన్నారు. అది బడా నిర్మాతలు, హీరోల చేతుల్లో బందీగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. సినిమా రంగంలో విప్లవాత్మక మార్పులు తేవాలని సూచించారు. సినిమాలకు సంబంధించిన చట్టాలను సమాజానికి ఉపయోగపడేవిగా సంస్కరించాలని కోరారు. సందేశాత్మక సినిమాలకు అన్ని రకాలుగా ప్రోత్సహించాలని ప్రభుత్వానికి సూచించారు. రక్షణ పేరులో లైసెన్స్ గుండాలా బౌన్సర్లు వ్యవహరిస్తున్నారని, ఇలాంటి ఘటనలకు కారణమవుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సెలబ్రిటీల భద్రత బాధ్యతలను పోలీసులకు అప్పగించడం శ్రేయస్కరమని ప్రభుత్వానికి కూనంనేని సాంబశివరావు సూచించారు. సినిమా రంగంలో కమ్యూనిస్టుల ప్రభావం ఉన్నకాలంలో సమాజానికి మేలు చేసే గొప్ప చిత్రాలు తెరకెక్కినట్లు గుర్తుచేశారు. సామాజిక స్ఫూర్తితో మాదాల రంగారావు, ఆర్.నారాయణ మూర్తి వంటివారు సినిమాలు నిర్మిస్తే అనుమతించని సెన్సర్ బోర్డు.... కథానాయకుడు ఎర్రచందనం స్మగ్లర్ పాత్ర పోషిస్తే ఎలా అనుమతించిందని కూనంనేని ప్రశ్నించారు. అల్లు అర్జున్ అరెస్టుకు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం సరికాదన్నారు. హీరోయిజం మంచి పక్షానే ఉంటూ, సమాజానికి మార్గదర్శకం కావాలే తప్ప చెడును ప్రోత్సహించరాదని హితవు పలికారు. హాస్యనటుడు అల్లు రామలింగయ్య కొన్ని సినిమాల్లో విలన్‌గా నటించారు కానీ అందులో సునితత్వం ఉండేదని కూనంనేని చెప్పారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పేవరకు సంధ్యా థియేటర్ ఘటన గురించి పూర్తి విషయాలు ఎవరికీ తెలియలేదని అన్నారు.

**ప్రజాశ్రేయస్సే కమ్యూనిస్టులకు ముఖ్యం**

ఓట్లు, సీట్లు కాదు ప్రజా శ్రేయస్సే కమ్యూనిస్టు పార్టీకి, నాయకులకు ముఖ్యం అని కూనంనేని సాంబశివరావు అన్నారు. అధికార పార్టీతో సీపీఐ పొత్తుపెట్టుకున్నది ఓ ఎమ్మెల్యే... ఎమ్మెల్సీ పదవుల కోసమేనని కవిత చేసిన వ్యాఖ్యలను ఖండించారు. పేదలకు న్యాయం చేయడం, సమసమాజం స్థాపించడమే కమ్యూనిస్టుల

- మిగతా 2 లో

**ఎన్నికల నిబంధనల్లో మార్పులపై**

## సుప్రీంను ఆశ్రయించిన కాంగ్రెస్

న్యూదిల్లీ: ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నిబంధనల్లో మార్పులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ చర్యల వల్ల ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు భంగం కలగవచ్చని పేర్కొంది. ఎన్నికల కమిషన్ ఇటీవల చేసిన సవరణలను సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంచార్జ్ జైరాం రమేశ్ వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం ఇటీవల మార్పులు చేసింది. పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, వెబ్‌కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు... ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ) ను కేంద్ర న్యాయ శాఖ సవరించింది. ఈ చర్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఇదే అంశంపై జైరాం రమేశ్ సుప్రీం

- మిగతా 2 లో

## లోయలో పడిన సైనిక వాహనం

**ఐదుగురు జవాన్ల మృతి**

పూంచ్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. బాల్‌నోయ్ ప్రాంతంలో సైనికులు ప్రయాణిస్తున్న వాహనం 300 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోగా.. మరో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని... క్షతగాత్రులను సమీపంలోని సైనిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# అల్లు అర్జున్‌పై ప్రశ్నల వర్షం

**20కు పైగా ప్రశ్నలతో 3 గంటల విచారణ**

విశాలాంధ్ర-హైదరాబాద్: పుష్ప-2 చిత్రం వివాదం హీరో అల్లు అర్జున్‌ను న్యాయ చిక్కుల్లో పడవేసింది. ఆయనను చిక్కడపల్లి పోలీసులు మంగళవారం మూడు గంటలకుపైగా విచారించారు. ఉదయం 11.05కు విచారణకు హాజరైన అల్లు అర్జున్‌ను మధ్యాహ్నం 2.47 గంటల వరకు ప్రశ్నించారు. తొక్కిసలాట ఘటనపై ఇటీవల విడుదల చేసిన 10 నిమిషాల వీడియో ఆధారంగా విచారణ జరిగినట్లు తెలిసింది. విలేకరుల సమావేశంలో ప్రస్తావించిన అంశాలపైనా పోలీసులు ఆరా తీశారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేశ్,

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

అవును సార్... ఈ ఉద్యోగం నాకు మీ హయాంలోనే వచ్చింది!

## దిల్లీకి చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిల్లీలో కీలక కార్యక్రమాలకు హాజరవడానికి వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు బుధవారం దిల్లీలో జరిగే మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, రాజకీయ

- మిగతా 2 లో

# ఏయూ భూముల స్వాహా?

- రూ.50 కోట్ల విలువైన స్థలం కబ్జాకు ఆక్రమణదారుల స్కెచ్
- వర్సిటీ అధికారుల పొంతనలేని సమాధానాలు

విశాలాంధ్ర-విశాఖపట్నం: ప్రసిద్ధ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన 1,400 గజాల విలువైన స్థలంపై ఆక్రమణదారుల కన్ను పడింది. ఆ స్థలం రక్షణ కోసం గట్టి చర్యలు చేపట్టని వర్సిటీ అధికారుల ఉదాసీనత వైఖరిని తమకు అనుకూలంగా మలుచుకొని, అందులో ప్రైవేట్ ప్రాజెక్టు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో కొంతమంది రాజకీయ నాయకులు... విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి కథ మొత్తం నడిపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే... ఆంధ్ర విశ్వవిద్యాలయానికి బీచ్ రోడ్ వరకు ఆనుకొని సుమారు 80 ఎకరాల స్థలం ఉంది. అందులో ఉద్యోగుల క్వార్టర్స్, వర్సిటీ కన్వెన్షన్ హాలుతో పాటు కొన్ని ఎకరాల్లో ఖాళీ స్థలం ఉంది. దీంట్లో బీచ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో కొంత మొత్తాన్ని వీఎంఆర్డీఏ ప్రాజెక్టు, పోలీసు మెస్‌కు కేటాయించారు. వీటికి మధ్యలో బీచ్‌కు ఎదురుగా, సీ హారియర్ మ్యూజియం పక్కన 1,400 గజాల ఖాళీ స్థలం ఉంది. ఇక్కడ మార్కెట్ విలువ ప్రకారం కనీసం

- మిగతా 2 లో

"చిరు జ్ఞాపకాలు
చిరస్మరణీయాలు
త్యాగమయ చారిత్రక మూలాలు
నూరు వసంత ఉషోదయాల
అరురారుణ పారిజాత
అక్షర సుమాంజలి"
అందుకోండి 26వ తేదీ
సంచిక నుండి ప్రతి ఉదయం
మన విశాలాంధ్రలో....

# ద.కొరియాలో ముదిరిన రాజకీయ సంక్షోభం

## ఆపద్ధర్మ అధ్యక్షుడిపై అభిశంసనకు విపక్షం సిద్ధం

**సియోల్:** దక్షిణ కొరియాలో రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. ఆపద్ధర్మ అధ్యక్షుడు హాన్ డక్ సూపై అభిశంసనకు విపక్షం కసరత్తు చేస్తోంది. మార్షల్ లా అమలుతో అధ్యక్షుడిగా యూన్ సుక్ యోల్ పదవి పోయింది. పార్లమెంటులో సంఖ్యాబలం ఉన్న ప్రతిపక్ష డెమొక్రాటిక్ పార్టీ ఇప్పుడు హాన్ అభిశంసనకు నడుం బిగించింది. తాము ఆమోదించిన బిల్లులకు హాన్ మంగళవారంలోగా ఆమోదించకపోతే ఆయన అభిశంసనకు చర్యలు తప్పబోవని హెచ్చరించింది. ఒకవేళ హాన్‌పై అభిశంసనకు పార్లమెంటు ఆమోదం లభిస్తే దక్షిణ కొరియా మరింతగా రాజకీయ సంక్షోభంలోకి కూరుకుంటుంది. ఈ పరిస్థితులు పొరుగు దేశాలనూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. హాన్ డక్‌పై వేటు పడితే ఆయన స్థానంలో పదవీ బాధ్యతలను ఆర్థిక మంత్రి చేపట్టాల్సి వస్తుంది. ప్రతిపక్షం తెచ్చే బిల్లులను హాన్ డక్ సూ వీటో చేయడంపై డెమొక్రటిక్ పార్టీ మండిపడింది. రాజ్యాంగబద్ధ న్యాయస్థానంలో జడ్జిల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. యూన్‌పై విచారణ కోసం ప్రత్యేక ప్రాసిక్యూటర్ల నియామకాన్ని కోరింది. యూన్ భార్యపై అవినీతి ఆరోపణల క్రమంలో కేసు విచారణను డిమాండ్ చేసింది. మంగళవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఆయా బిల్లులను అజెండాలో హాన్ పెట్టలేదు. వాటిపై అధికార, విపక్షాలు మరింతగా చర్చించాలని సూచించారు. అయితే యూన్‌పై విచారణ విషయంలో చర్చించేందుకు ఏమీ లేదని డెమొక్రటిక్ పార్టీ నేత పార్క్ చాన్ డే అన్నారు. అభిశంసనకు తమ పార్టీ కట్టుబడిందన్నారు.

# బిల్ క్లింటన్‌కు అస్వస్థత

**వాషింగ్టన్:** అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ (78) అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో బాధపడుతున్న ఆయనకు వాషింగ్టన్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు వ్యక్తిగత సిబ్బంది తెలిపారు. క్రిస్మస్ నాటికి డిశార్జ్ అవుతారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. బిల్ క్లింటన్ రెండు సార్లు (1993-2001) అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. 2004లో ఛాతీ నొప్పి, శ్వాసకోస సమస్యలతో నాలుగుసార్లు శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. ఆ ఏడాది తర్వాత ఊపిరితిత్తులు మళ్లీ దెబ్బ తినడంతో ఆసుపత్రి పాలయ్యారు. 2010లో గుండె సమస్య రావడంతో రెండు స్టెంట్లు అమర్చారు. కొద్ది రోజులకు పూర్తిగా కోలుకున్నారు కానీ 2021లో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడ్డారు. తాజా అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో డెమోక్రట్ల తరపున ఆయన చురుకుగా ప్రచారం కూడా చేశారు. క్లింటన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆయన వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# టర్కీలో పేలుడు: 12 మంది దుర్మరణం

**అంకారా:** టర్కీలోని ఒక ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 12 మంది దుర్మరణం చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పేలుడు ధాటికి ఫ్యాక్టరీలోని ప్రధాన భవనం కుప్పకూలింది. చుట్టుపక్కల భవనాలు దెబ్బతిన్నాయి. వాయువ్య టర్కీలోని బల్కిసెర్ ప్రావిన్స్‌లోని కవక్లి నగర శివార్లలోని జేఎస్ఆర్ ఎక్స్‌ప్లోజీవ్స్ ఫ్యాక్టరీలో ఈ ఘటన జరిగిందని అక్కడి గవర్నర్ ఇస్మాయిల్ వెల్లడించారు. అనంతరం గాయపడిన వారి సంఖ్య ఐదుకు పెరిగిందని అధికారులు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయ పరిస్థితి లేదన్నారు. మంగళవారం ఉదయం 8.25 గంటలకు ఈ పేలుడు సంభవించినట్లు వెల్లడించారు. ఈ ఫ్యాక్టరీలో మందుగుండు సామగ్రితో పాటు ఆయుధాలను తయారు చేసి ఎగుమతి చేస్తారు. పేలుడుకుగల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు అంతర్గత శాఖ మంత్రి అలీ తెలిపారు. అయితే సాంకేతిక లోపాల కారణంగా ఈ ఘటన జరిగివుంటుందని అధికారులు అంచనా వేశారు.

**ఎర్డొగన్ దిగ్భ్రాంతి:** టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డొగన్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 12 మంది చనిపోవడం బాధాకరమని ఎక్స్‌లో పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు.

# చైనా పొలిటికల్ కమిషనర్‌గా జనరల్ చెన్ హుయ్

**బీజింగ్:** చైనా సైన్యాధికారి చెన్ హుయ్‌కు జిన్‌పింగ్ ప్రభుత్వం జనరల్‌గా పదోన్నతి కల్పించింది. ఆయనను ఆర్మీ ఆఫ్ ది పీపుల్స్ లిబరేషన్ (పీఎల్ఏ) పొలిటికల్ కమిషనర్‌గా నియమించింది. ఇందుకు సంబంధించిన పత్రాన్ని బీజింగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు కేంద్ర సైనిక కమిషన్ (సీఎంసీ) చైర్మన్ జిన్‌పింగ్ ప్రదానం చేశారు. జనరల్ చెన్‌కు చైనా అధ్యక్షుడు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జనరల్ చెన్‌కు పదోన్నతి కల్పిస్తున్నట్లు సీఎంసీ వైస్ చైర్మన్ జాంగ్ యూషియా ప్రకటించారు. క్విన్ షుటాంగ్ స్థానంలో జనరల్ చెన్ నియమితులయ్యారు. జనరల్ చెన్ గతంలో ఏరోస్పేస్ దళాధిపతిగా పనిచేశారు.

# హనియా హత్య, అసద్ పతనం మా పనే

## ఇజ్రాయిల్ అధికారిక ప్రకటన

**టెల్ అవీవ్:** హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హనియాను హతమార్చినట్లు ఇజ్రాయిల్ అంగీకరించింది. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేసింది. జులైలో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హనియను హత్య చేసినట్లు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ తెలిపారు. యెమన్‌లోని హౌతీలను హెచ్చరిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. ఇప్పటివరకు తాము చేసినవి... చేయబోయే వాటి గురించి, సాధించిన విజయాల గురించి కట్జ్ వెల్లడించారు. హౌతీలపై క్షిపణి దాడులు, హమాజ్, హెజ్బుల్లాపై భీకర పోరు గురించి వీడియోలో కట్జ్ వెల్లడించారు. ఇరాన్ రక్షణ, ఉత్పత్తి వ్యవస్థలను నాశనం చేసినట్లు తెలిపారు. సిరియాలో అసద్ పాలనను పడగొట్టామని ప్రకటించారు. హనియా, సిన్వర్, నస్రల్లాలను హత్య చేసినట్లు ఇజ్రాయిల్ అధికారికంగా ప్రకటించింది. హనియా హత్య గురైన దాదాపు ఐదు నెలల తర్వాత ఇజ్రాయిల్ ప్రకటన చర్చకు దారితీసింది.

# సుప్రీంను ఆశ్రయించిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

కోర్టులో తాజాగా రిట్ పిటిషన్ దాఖలు చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్... ఏకపక్షంగా, ప్రజలతో సంప్రదింపులు లేకుండా ఎన్నికల ప్రక్రియ నిబంధనల్లో మార్పులు చేయడం దారుణమన్నారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను ఏకపక్షంగా తొలగించడం లేదా చేర్చడం వంటి చర్యలకు పాల్పడలేదని కేంద్ర ఎన్నికల సంఘం కాంగ్రెస్‌కు తెలిపింది. ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకత, నిబంధనలు పాటించినట్లు పేర్కొంది. మహారాష్ట్రలో ఓటర్ల తొలగింపులో అవతవకలు జరగలేదన్న ఈసీ... కాంగ్రెస్ ప్రతినిధుల భాగస్వామ్యంతో పాటు తగిన ప్రక్రియను అనుసరించామని తెలిపింది.

# కొనసాగుతున్న అల్పపీడనం

(మొదటిపేజీ తరువాయి)

బంగాళాఖాతం, దానిని అనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం క్రమంగా బలహీన పడే అవకాశముంది. కోస్తా తీరం వెంట గంటకు 35 నుంచి 45 కిలోమీటర్లు..గరిష్టంగా 55 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. కోస్తా ఆంధ్రా తీరంలోని అన్ని పోర్టుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మంగళ, బుధ వారాల్లో కోస్తా తీరంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని వాతావరణశాఖ అధికారులు ఆదేశించారు. మరో 3, 4 రోజులపాటు పడవలు ఒడ్డుకే పరిమితం కానున్నాయి. భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో అధికారయంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలకు నిమగ్నమైంది. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత అధికమైంది. రాత్రుళ్లతోపాటు పగలు కూడా చలిగాలులు వీస్తున్నాయి. మన్యంలో చలి పులి పంజా విసురుతోంది. జి.మాడుగలలో ఈనెల 23వ తేదీన 9.7డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

# సీపీఐ వందేళ్ల పండుగ

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో గురువారం విజయవాడలోని చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించటం నుంచి శత వార్షిక ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. దేశంలో వంద సంవత్సరాల చరిత్ర కగిలిన పార్టీలు కాంగ్రెస్, సీపీఐ మాత్రమే అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అనేక మంది త్యాగాలు చేశారనీ, ఆస్తులు పోగొట్టుకున్నారనీ, జైలుకెళ్లారనీ, ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారన్నారు. ఆ పోరాటంలో పాల్గొన్నవారు స్వాతంత్ర్య సమరయోధులుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారని గుర్తు చేశారు. సీపీఐ పేదల భూమి కోసం, భుక్తి కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. స్వాతంత్ర్యానంతరం కూడా కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమాలు చేసిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, త్యాగాలను నేటితరం తెలుసుకోవాలని కోరారు.

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవమానించటంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్నప్పటికీ ఏ మాత్రం పశ్చాత్తాపం చెందకుండా తన వ్యాఖ్యలను అమిత్ షా సమర్థించుకుంటున్నారని చెప్పారు. తన కేబినెట్ మంత్రి చేసిన వ్యాఖ్యలను ప్రధాన మంత్రి మోదీ ఖండించకుండా నిస్సిగ్గుగా సమర్థిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తులకు అంబేద్కర్ రాజ్యాంగంపై ఏ మాత్రం గౌరవం లేదన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని బుట్టలో పడేస్తామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నట్లు చెప్పారు. ప్రజలు 240 సీట్లకు పరిమితం చేయటంతో నితీశ్‌కుమార్, చంద్రబాబుల మద్దతుతో ఎన్డీఏ కూటమిని నడిపిస్తున్నారని తెలిపారు. బీజేపీకి చెందిన మాజీ పార్లమెంటు సభ్యుడు సుబ్రహ్మణ్య స్వామి రాజ్యాంగ పీఠికను మార్చాలని, లౌకిక రాజ్యం, సామ్యవాదం పదాలను రాజ్యాంగం నుంచి తొలగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారన్నారు. అదృష్టవశాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్వర్యంలో ధర్మాసనం లౌకిక రాజ్యం, సామ్యవాదం పదాలను తొలగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేయటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారని తెలిపారు. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా వామపక్షాల పిలుపుమేరకు నిరసనలు తెలపటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈ నెల 30వ తేదిన వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

అవినీతి అదానితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ నడుస్తోందని రామకృష్ణ తెలిపారు. అదానితో ఒప్పందం కుదరటానికి రూ.2,100 కోట్లు చత్తీస్‌ఘడ్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు లంచంగా ఇచ్చినట్లు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ తేల్చిందని, దీనిపై న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. 2021లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.1750 కోట్లు లంచం ఇచ్చి అదాని సోలార్ కంపెనీతో ఒప్పందం జరిగినట్లు తేలిందన్నారు. ఈ మేరకు అదానీతో జరిగిన ఒప్పందాన్ని రద్దు చేయాలని సెంటర్ ఫర్ లిబర్టీ రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కి లేఖ రాసిందన్నారు. తాము కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరినట్లు చెప్పారు. చిన్న చిన్న అంశాలకే స్పందించే చంద్రబాబు ఇంత పెద్ద కుంభకోణం జరిగినా స్పందించకపోవటం సరికాదన్నారు. చంద్రబాబు ఎందుకో జంకుతున్నారని సందేహం వెలిబుచ్చారు. అదానీతో జరిగిన ఒప్పందం చిన్న విషయం కాదని, రానున్న 25ఏళ్ల పాటు విద్యుత్ వినియోగదారులపై లక్షా పది వేల కోట్ల రూపాయల భారం పడుతుందని స్పష్టం చేశారు. ఈ విషయంపై సీపీఐ హైకోర్టులో కేసు వేసిందని, ఇంకా న్యాయం జరగలేదన్నారు. చిన్నస్థాయి అధికారి రూ.5వేల లంచం తీసుకుంటే పరుగులుతీసే ఏసీబీ అధికారులు ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని నిలదీశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ విషయంపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై స్పందించినట్లు అదానీతో ఒప్పందంపై ఎందుకు నోరుమెదపటం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి స్పందించాలని, అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసే వరకు పోరాడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీపీఐ శత వార్షికోత్సవాల పోస్టర్‌ను రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

# దేశంలో అప్రకటిత యుద్ధంపై చర్చ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

అధునాతన ఆయుధాలతో ఊచకోత కోసుకునే పరిస్థితి ఏర్పడిందని, ఖనిజ సంపదను దోచుకోవడానికి కార్పొరేట్ సంస్థలు అక్కడ అంతర్యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్నాయని సీఎం అన్నారు. భారత బలగాలు మణిపూర్ శాంతిని నెలకొల్పాలేవా? తలచుకుంటే అక్కడి ఆయుధాలను సీజ్ చేయలేరా? అని సీఎం ప్రశ్నించారు. ముల్కీ- నాన్ ముల్కీ నుంచి, తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమాలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు సంపూర్ణ వివరాలతో ఒక పుస్తకాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ ఉద్యమ పరిణామ క్రమాలను వివరిస్తూ తెలంగాణ ఉద్యమం చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాలని కోరారు. ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన వారి గురించి కూడా ఆ పుస్తకంలో వివరించాల్సిన అవసరం ఉందని, అలాంటి పుస్తకాన్ని ప్రజల ముందుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. చాలా మంది సిద్ధాంతాలు చెబుతారని, కానీ పాటించే వారు మాత్రం కొద్దిమందే ఉంటారని, అలాంటి వారిలో యాదవరెడ్డి ఒకరని, నమ్మిన సిద్ధాంతాన్ని పాటించే వ్యక్తి అని అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి లాంటి వారు హార్డ్ కోర్ కమ్యూనిస్టులయితే జైపాల్ యాదవ రెడ్డి లాంటి వారు సాఫ్ట్ కోర్ కమ్యూనిస్టులని సీఎం రేవంత్ పేర్కొన్నారు. దేశంలో పేదలకు అభివృద్ధి ఫలాలను అందించేందుకు జైపాల్ లాంటి వారు మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో పనిచేశారని, పదవుల కోసం కాకుండా సిద్ధాంతాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారు పనిచేశారన్నారు.

తెలంగాణ ఉద్యమంలోనూ యాదవరెడ్డి కృషి ఎంతో ఉందని, తెలంగాణ కోసం తెర వెనుక కృషి చేసిన వారిలో యాదవ్ ఒకరని కొనియాడారు. తెలంగాణ కోసం సోనియాగాంధీతో చర్చించిన సమయంలో యాదవ్ కూడా తెలంగాణ ఆవశ్యకతను సోనియాకు వివరించారన్నారు. తెలంగాణ బిల్లును ఆమోదించించడంలో జైపాల్ రెడ్డితో పాటు యాదవరెడ్డి తన బాధ్యత నిర్వహించారన్నారు.

పల్లబ్ గుప్తా మాట్లాడుతూ సోవియట్ రష్యా విచ్ఛిన్నం అనంతరం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయో చూస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా శాంతి ఉద్యమాన్ని బలోపేతం చేయడం ద్వారా యుద్ధ వాతావరణాన్ని నివారించాల్సిన అవసరముందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వ మార్పును తీసుకువచ్చేందుకు, ప్రపంచశాంతి ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు యాదవ్ పుస్తకం దోహదపడుతుందన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని, గ్లోబల్ వార్మింగ్‌ను నివారించడమే ప్రపంచ ప్రజలకు నిజమైన విముక్తి అన్నారు. భవిష్యత్ తరాలు శాంతియుతంగా జీవించేందుకు శాంతి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకుపోవాలని శాంతి ఉద్యమకారులను కోరారు. జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు రక్షణ శాఖకు కేటాయిస్తున్న ఖర్చును తగ్గించుకుని ప్రజల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఖర్చు చేయాలన్నారు. బోయినిపల్లి వినోద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారుల శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అలజడి సృష్టిస్తున్నాయని, అయినప్పటికీ మూడవ ప్రపంచ యుద్ధం పరిస్థితులను ఆపడంలో విజయవంతమయ్యామన్నారు. యుద్ధాల వల్ల ఇప్పటివరకు దాదాపు 1.62 లక్షల మంది సైనికులు మరణించారని, బలమైన శాంతి ఉద్యమాలతో యుద్ధాలను నివారించడం ద్వారా మానవ వనరులను కాపాడుకోవాలన్నారు. పాశం యాదగిరి మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరంగా ఉన్న సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారుల యుద్ధోన్మాం అంతరిస్తే తప్పా ప్రజలు బతకలేరని, సామ్రాజ్యవాదం అంత కావాలన్నారు. పుస్తక రచయిత కొంపల్లి యాదవ్ పుస్తకం గురించి వివరిస్తూ ప్రపంచ దేశాలు రక్షణ శాఖలకు దాదాపు 2.4 ట్రిలియన్ డాలర్ల బడ్జెట్ కేటాయిస్తున్నాయని, వాటిలో కనీసం 10 శాతం బడ్జెట్ తగ్గించుకున్నా ప్రపంచంలోని మొత్తం జనాభాకు విద్య, వైద్యం, నివాసాన్ని సమకూర్చవచ్చని అన్నారు. దాదాపు 64 వేల కోట్ల డాలర్ల అప్పులున్నప్పటికీ రక్షణ శాఖకు బడ్జెట్ కేటాయింపులో ప్రపంచంలోనే భారత్ మూడవ స్థానంలో ఉండడం బాధాకరమన్నారు

# ఐపీఎస్ సంజయ్‌పై ఏసీబీ కేసు

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదైంది. గత ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక శాఖ డీజీ, సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన సంజయ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనపై ఏసీబీ విచారణకు ఆదేశించింది. దీనిపై అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ కింద అనుమతి కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఏసీబీ అధికారులు లేఖ రాశారు. సీఎస్ నుంచి అనుమతి లభించడంతో సంజయ్‌పై కేసు నమోదైంది. ఏ1గా సంజయ్, ఏ2గా సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా, ఏ3గా క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. సీఐడీ తరపున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించకపోయినా బిల్లుల పేరిట దోచేశారని, ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల మేర నష్టం కలిగించారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది.

# ఏయూ భూముల స్వాహా?

(మొదటిపేజీ తరువాయి)

ఆ స్థలం విలువ రూ.50 కోట్లకు పైమాటే. దీంతో కొన్నేళ్లుగా ఆక్రమణదారుల కన్ను ఈ భూమిపై పడింది. దీనిని ఎలాగైనా సొంతం చేసుకునేందుకు అనేక మంది గట్టి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అదే సమయంలో అక్కడే పోలీసు మెస్ ఉండడంతో పోలీసు ఉన్నతాధికారులు, హోం మంత్రి సహా గత ప్రభుత్వంలో ఆ స్థలం తమకు కేటాయించాలని వర్సిటీ ఉన్నతాధికారులకు 2020లో లేఖ రాశారు. అప్పటికే విశ్వవిద్యాలయ భూములు పెద్ద మొత్తంలో తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం దానికి బదులుగా ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వకపోవడంతో పోలీసు శాఖకు ఆ భూమి ఇవ్వడం కుదరదని విశ్వవిద్యాలయ అధికారులు తేల్చి చెప్పారు. అప్పటి హోం మంత్రి సహా పోలీసు ఉన్నతాధికారులు గట్టిగా ఒత్తిడి చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం విశ్వవిద్యాలయ అధికారులు ఆ విషయాన్ని ప్రభుత్వానికి చేరవేశారు. దీంతో ఆ ప్రతిపాదన పెండింగ్‌లో పడింది. అప్పటికే అనేక మంది ఆక్రమణదారులు ఆ స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో స్థలం కాంపౌండ్ వాల్ బాగు చేసి... స్థలం విశ్వవిద్యాలయానికి చెందిందని, ఆక్రమణదారులు శిక్షార్హులంటూ ఒక బోర్డు పెట్టారు. అక్కడితో తాత్కాలికంగా ఆ స్థలానికి రక్షణ లభించింది. ఇటీవల మళ్లీ ఆ స్థలం ఆక్రమించుకునేందుకు అనేక మంది ప్రయత్నాలు మొదలుపెట్టారు. కొన్ని నెలల క్రితం ఆ స్థలాన్ని చేజిక్కించుకునే ప్రయత్నంలో భాగంగా అక్కడ ఒక కంటైనర్‌ను పెట్టారు. దానిని మళ్లీ తొలగించడంతో ఇటీవల అక్కడ ఒక షెడ్డు వెలిసింది. ఆ షెడ్డు ఎవరిది, ఎవరు వేశారనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. ఈ విషయంలో విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ శాఖ అధికారులు తలో రకంగా సమాధానం చెబుతున్నారు. గతంలో అక్కడ ఉన్న కంటైనర్ తొలగించామని, ఇప్పుడు ఆ స్థలంలో ఏమీ లేదని కాసేపు, అది వీఎంఆర్డీఏకు చెందిన ప్రాజెక్టుగా అప్పగించామని ఒకసారి, జీవీఎంసీ వాళ్లు మోటార్లు పెట్టుకున్నారని ఇలా పొంతన లేని సమాధానాలు చెబుతూ ఆ స్థలం ప్రస్తావనను దాటవేస్తున్నారు. ఈ విషయంపై వర్సిటీ రిజిస్ట్రార్ వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆ స్థలం ఆక్రమణకు విశ్వవిద్యాలయంలోని కొంతమంది తమ వంతు సహాయసహకారాలు అందిస్తున్నారా? అనే అనుమానాలు విశ్వవిద్యాలయానికి చెందిన విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయ భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతం కాగా, ఉన్న భూములు కూడా కాపాడుకునే ప్రయత్నాలు చేయకపోవడంపై వారు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఉదాసీన వైఖరిని సహించబోమని విద్యావేత్తలు మండిపడుతున్నారు. ఇకనైనా ఆంధ్ర విశ్వవిద్యాలయం భూములను పరిరక్షించుకునేందుకు ఎస్టేట్ అధికారి అధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ ఉండేలా కార్యాచరణ రూపొందించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

# అల్లు అర్జున్‌పై ప్రశ్నల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

ఇనస్పెక్టర్ రాజు దాదాపు 20 ప్రశ్నలు అడిగారని, వీడియోలు, సిసిటీవీ ఫుటేజి ఆధారంగా ప్రశ్నించి అల్లు అర్జున్ వాంగ్మూలం తీసుకున్నారని సమాచారం. సంధ్య థియేటర్ సీనియర్ మేనేజర్ నాగరాజును పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకొని వివరాలు రాబట్టారు. పుష్ప-2 ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ సహా ఇతర నటీనటుల రాకకు పోలీసులు అనుమతి తిరస్కరించినట్లు నాగరాజు అంగీకరించారు. నాగరాజు చెప్పినదానిని ఆధారంగా చేసుకొని అల్లు అర్జున్‌ను పోలీసులు విచారించారు. అవసరమైన మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని చెప్పారు. విచారణ ముగిశా అల్లు అర్జున్ అక్కడ నుంచి నేరుగా జూబ్లీహిల్స్‌లోని తన ఇంటికి వెళ్లిపోయారు. ఆయన వెంట తండ్రి అల్లు అరవింద్, మామ చంద్రశేఖర్ రెడ్డి, న్యాయవాది అశోక్ రెడ్డి ఉన్నారు. అల్లు అర్జున్ విచారణ క్రమంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, పుష్ప-2 ప్రీమియర్ షో సమయంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణించగా ఆమె కుమారుడు శ్రీతేజ్ గాయపడ్డాడు. పోలీసుల సూచనలను బేఖాతరు చేసి ఒకరి మృతికి కారణమైనట్లు అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేయడం, ఆయనను ఎ-11గా పేర్కొనడం విదితమే. అల్లు అర్జున్‌కు హైకోర్టు మధ్యంతర బెయిల్‌పై జైలు నుంచి విడుదల కావడం తెలిసిందే.

**అల్లు అర్జున్ బౌన్సర్ ఆంటోనీ అరెస్టు**

అల్లు అర్జున్ వ్యక్తిగత సిబ్బంది, బౌన్సర్ ఆంటోనీని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. థియేటర్ వద్ద తొక్కిసలాటకు కారణం అతడేనని వారు అనుమానిస్తున్నారు.

# నల్లకన్ను 100వ జన్మదినం

(మొదటిపేజీ తరువాయి)

ఆనందంగా ఉందని సీనియర్ నాయకుడు పెజా నెదుమరన్ అన్నారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టే కార్యక్రమాల వివరాలను ఆయన మంగళవారం మీడియాకు తెలిపారు. 'రాజాజీ, పెరియార్, తిరువికా, కామరాజర్, అన్నాదురై, కలైంగర్, ఎంజీఆర్, జయలలిత, జీవా, పి.రామ్మూర్తి, మా.పో.సి వంటి వారు ప్రజల కోసం జీవించారు కానీ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోలేకపోరు. ఆ అదృష్టం కమ్యూనిస్టు నాయకులు ఎన్.శంకరయ్య, ఆర్.నల్లకన్నుకు దక్కింది. వీరితో కలిసి ఉండటం మనకు గర్వకారణం' అని అన్నారు. రాజకీయ నాయకులందరితో నల్లకన్నుకు సత్సంబంధాలు ఉన్నాయని, పార్టీలకు అతీతంగా ఆయనను అందరూ గౌరవిస్తారని నెదుమరన్ చెప్పారు.సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, తమిళ మేధావులు, జర్నలిస్టులు, కార్మిక నాయకుల పేమాభిమానాలను నల్లకన్ను పొందగలిగారన్నారు. ఉత్సవాల్లో అన్ని రంగాల వారు పాల్గొనున్నట్లు నెదుమరన్ తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖుల్లో సీపీఐ ప్రధాన కార్యదర్శి, సామాజిక కార్యకర్త మేధా పట్కార్, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రు, విట్ వ్యవస్థాపకుడు జి.విశ్వనాథన్, మాజీ సీఎస్ వి.ఇరానీ అంబు, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో, వీసీకే వ్యవస్థాపకుడు థోల్ తిరుమవలవన్, విద్యావేత్త వాసంతి దేవి, చిత్ర నిర్మాత వెట్రిమారన్, నటుడు విజయ్ సేతుపతి, 'నకీరన్' గోపాల్, తమిళగా వల్లురిమై కట్చి వ్యవస్థాపకుడు టి.వెమురుగన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముతరాసన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ తదితరులు ఉన్నారు. కాగా, నల్లకన్ను ప్రసంగిస్తారు. ఈ ఉత్సవాలు ధర్మలింగం ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో జరగనున్నాయి.

# సినీరంగంలో విప్లవాత్మక మార్పు

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యమని... దిగజారుడు రాజకీయాలు చేయడం కాదని నొక్కిచెప్పారు. కమ్యూనిస్టులతో పొత్తు కారణంగానే గెలిచిన గతాన్ని బీఆర్ఎస్ గుర్తు చేసుకోవాలన్నారు. కమ్యూనిస్టుల చరిత్రతో దేశ చరిత్ర ముడిపడి ఉందని... తమకు ఎవరో సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదని కూనంనేని సాంబశివరావు అన్నారు.

**ఘనంగా శతాబ్ది ఉత్సవాలు**

సీపీఐ శతాబ్ది వేడుకలను ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. ఈనెల 30న నల్లగొండ జిల్లాలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండాగా సభలు, సమావేశాలు, ఆందోళనలు వివిధరూపాల్లో కార్యక్రమాలను ఏడాది పొడవునా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఖమ్మం సభతో వేడుకలు ముగుస్తాయన్నారు.

# రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

అవమానించిన అమిత్ షా రాజీనామాను కోరడం మనందరి నైతిక హక్కు అని భట్టి విక్రమార్క నొక్కిచెప్పారు. దేశంలో అన్ని మతాల వారు అన్నదమ్ముల్లా కలిసుంటున్నాయని, బీజేపీ నీచ సంస్కృతికి తెర తీస్తోందని తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు హితవు పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్ ముక్తార్, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళ అభివృద్ధి చైర్మన్ నాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. వాజ్‌పేయి రాజకీయ మార్గదర్శకత్వం, దేశభక్తి, వంటి అనేక సేవలను గుర్తు చేసుకునేందుకు ఈ వేడుక నిర్వహిస్తున్నారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఆయనకు చంద్రబాబు నివాళు లర్పించనున్నారు. ఆయన రాజకీయ ఆశయాలను కొనసాగించే క్రమంలో భారతదేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ విధానాలను ఎలా పటిష్టం చేయాలనే అంశంపై చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశంలో ఎన్డీయే కూటమిలో భాగమైన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు, బీజేపీ నేతలు పాల్గొని, దేశ రాజకీయాలపై సమీక్ష, చర్చలు జరిపే అవకాశం ఉంది. తెలుగు దేశం పార్టీ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేయడానికి వివిధ అంశాలను ప్రస్తావించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## చిరు వ్యాపారులకు నష్టం కలిగించొద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హుస్నాబాద్ : హుస్నాబాద్ ప్రధాన రహదారిలోని కూడళ్లలో చిరు వ్యాపారులకు నష్టం కలిగించొద్దని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సుందరీకరణ పనులు, అంబేద్కర్ చౌరస్తా ప్రధాన కూడలిలో వాహనాల రాకపోకల అంశంపై అధికారులతో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో నాలుగు వరుసల రోడ్ల మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో చిరు వ్యాపారులు, కిరాణా వర్తక వాణిజ్య వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా డిసెంబర్ 31 లోపు బస్టాండ్ పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ ఐలేని అనిత, చిత్తారి పద్మ, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, పలుశాఖల ఉన్నతాధికారులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రి ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - ఇల్లందు : ప్రజల ఆరోగ్యం కాపాడడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు ఏరియా ఆసుపత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్లో అడ్మిట్ అయి ఉన్న గర్భిణులతో పలకరించి ఆరోగ్య పరిస్థితుల గురించి, అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డాక్టర్లను వైద్య సిబ్బంది సున్నితంగా హెచ్చరించారు. రోగులకు ఎల్లప్పుడు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొంతమంది రోగులను పరామర్శించారు. హాస్పిటల్లో డెలివరీ అయిన ఒక మహిళను, పాప ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రోగుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా కల్పించారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఆరోగ్యాన్ని రక్షించడంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ హర్షవర్ధన్, ఆర్ ఎం ఓ డాక్టర్ రామ్ నివాస్, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, మండల రాము, కాకాటి భార్గవ్, బానోత్ శారద, ఉల్లింగ సతీష్, బక్కతట్ల వెంకన్న, పందిళ్ళ వెంకటేశ్వర్లు, పరిదల నవీన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్ : రాజ్యాంగాన్ని మార్చాలనే, అమిత్‌షా లాంటి వారు అంబేద్కర్‌ని అవమానించే విధంగా ప్రవర్తించే, మనువాదుల దాడిని తిప్పి కొట్టడానికి ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ కొరవి మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అణగారిన వర్గాలకు హక్కులు కల్పించిన అంబేద్కర్ లాంటి మహనీయున్ని సాక్షాత్తు దేశ హోమ్ మినిస్టర్ అవమానించడం అంటే దేశంలోని కోట్లాదిమంది దళిత గిరిజన బలహీన వర్గాలను అవమానించినట్లేనని అన్నారు. గత పదిహేళ్లుగా బిజెపి వ్యూహాత్మకంగా, లౌకిక ప్రజాస్వామిక, సమాఖ్య, విధానాలను నిర్వీర్యపరచడానికి బరితెగించి ప్రయత్నాలు కొనసాగిస్తుందన్నారు. దేశంలో అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ 99 ఏళ్ల ఆవిర్భావ ఉత్సవాలను ఈనెల 26న ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, తురక రమేష్, కన్నె వెంకన్న, దొంతు రామ్మూర్తి,దూది కట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, కురియాల వీరన్న, పాల్గొన్నారు.

## విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొమరం భీం : బెజ్జూర్ మండలం అందుగుల గూడ గ్రామానికి చెందిన తోర్రం వెంకటలక్ష్మి (19) ఆసిఫాబాద్ డిఎడ్ కళాశాలలో యందు రెండవ సంవత్సరం చదువుతున్న హాస్టల్ అస్వస్థతతో శ్వాససమస్యతో మృతి చెందారు. వెంకటలక్ష్మి విద్యార్థిని పెద్దకర్మ కార్యక్రమానికి సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. వెంకటలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

## ఆసుపత్రి నిర్మాణం 10 నెలల్లో పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : గోదావరిఖని నూతనంగా నిర్మిస్తున్న 350 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు రాబోయే 10 నెలలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఆయన నిర్మాణం అవుతున్న ఆసుపత్రి పనులను, రామగుండం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి నిర్మాణ పనులను తనిఖీ చేసి పనుల పురోగతి వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని పేషంట్లతో మాట్లాడి వారికి ఏ విధమైన సేవలందపతున్నాయో అడిగి తెలుసుకున్నారు. రామగుండం వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు సింగ్, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ అప్పారావు, డిప్యూటీ తహసిల్దార్ ఈశ్వర్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## మహిళలు, యువత ముందుకు రావాలి

విశాలాంధ్ర - వనపర్తి : మహిళా సమాఖ్య సభ్యులు, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొంది లాభదాయక వ్యాపారం చేసేందుకు ఇసుక, బూడిద, సిమెంట్‌తో చేసిన ఇటుకల తయారి యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు రావాలని జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి నేడోక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న 5 సంవత్సరాల్లో దాదాపు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ అని ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి మున్సిపాలిటీలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు ఇటుకలు తప్పనిసరి. స్థానికంగా లభించే మట్టి ఇటుకలు ఖరీదు కావడం, వాటి లభ్యత కూడా తగ్గిపోవడం తో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను సిమెంట్ లేదా బూడిదతో తయారు చేసిన ఇటుకలను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వాడేందుకు అనుమతించింది. అందువల్ల స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, నిరుద్యోగ యువత ముందుకు వచ్చి ప్రతి మండలంలో కనీసం 3 సిమెంట్ ఇటుకల యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు రావాలని సూచించారు.

# ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడమే లక్ష్యం

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రోడ్లను మండల కేంద్రాలకు అనుసంధానం చేస్తూ నూతన రోడ్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం జిల్లాలోని కన్నాయిగూడెం, ఏటూరు నాగారం, మంగపేట మండలంలలో 17 కోట్ల 98 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రోడ్లు, నూతన భవన నిర్మాణాల పనులకు రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎస్ పి షభరిష్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలల నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ భవనాలు లేనిచోట నూతన పరిజ్ఞానంతో భవనాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని రైతులను రాజులను చేయాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2 లక్షల రూపాయల వరకు రైతుల రుణాలను మాఫీ చేశారని, రానున్న రోజులలో రైతు బంధు అందించడంతో పాటు భూమిలేని నిరుపేద రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు అందజేయడానికి ప్రభుత్వ నిర్ణయించిందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఉద్దేశంతో మహిళల కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని, ఇప్పటికే రాష్ట్రంలో 52 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించగా, మన జిల్లాలో 187 మంది ఉపాధ్యాయులుగా, 40 మంది పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదింటి వారికి ప్రభుత్వ పథకాలను అందజేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా నేటి ప్రజా ప్రభుత్వం ప్రతి గంటకు మూడు కోట్ల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని, అయినప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూనే సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని అన్నారు.

## నేడు మెదక్ జిల్లాకు ఉప రాష్ట్రపతి, సీఎం రాక

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ మెదక్ జిల్లా పర్యటన ఖరరైంది. ఈనెల 25న బుధవారం మధ్యాహ్నం కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంకు రానున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపరాష్ట్రపతి వెంట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి దామోదర్ రాజానర్సింహా పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ సందర్శిస్తారు. కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తారు. అనంతరం సేంద్రీయ రైతుల అనుభవాన్ని పంచుకోవడం, రైతులకు ధృవపత్రాలు అందజేస్తారు. అఖిల భారతీయ కార్యకర్త సదస్యులు వడ్ల భాగయ్య, ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ మంత్రి దామోదర రాజ నరసింహ జీ, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఉపరాష్ట్ర పతి జగదీప్ ధనఖర్ ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మెదక్ జిల్లా మొదటి సారిగా అధికారిక పర్యటనకు వస్తున్నారు. ఈనెల 25న ఉదయం 11 గంటలకు తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయానికి మొదటిసారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. ఏడుపాయల చరిత్రలో సీఎం రావడం ఇదే మొదటిసారి. హెలికాప్టర్‌లో ఏడుపాయల చేరుకొని వన దుర్గ మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం సుమారు 700 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. మెదక్ చర్చి నిర్మించి వందేళ్లు అవుతుంది. శతాబ్ది ఉత్సవాలతో పాటు క్రిస్మస్ సందర్భంగా చర్చిలో జరిగే ప్రత్యేక ప్రార్ధనలు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఇటీవల మంజూరైన 29 కోట్ల 18 లక్షల 50 వేల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు.

**భారీ బందోబస్తు...**

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఐజి చంద్రశేఖర్ రెడ్డి సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ మహేందర్, సభా ప్రాంగణం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులకు ఆదేశించారు. మూడు హెలిపాడ్ లు ఏర్పాటు చేశారు. సేంద్రియ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు స్థలం రూట్ మ్యాప్ పరిశీలించారు. ఉప రాష్ట్రపతి పర్యటనకు సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ, డీఎస్పీలు 6, సిఐలు 20, ఎస్సైలు 50 తోపాటు ఢిల్లీ స్పెషల్ ఫోర్స్ బందోబస్త్ పర్యవేక్షణ చేస్తారు.

## గురుకుల విద్యార్థిని పరామర్శించిన రవీందర్ రెడ్డి

విశాలాంధ్ర- పినపాక: ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన గురుకుల విద్యార్థిని గుమాస అమూల్య ను పలువురు ముఖ్యులు పరామర్శిస్తున్నారు. పినపాక మండలం పెంటన్నగూడెం గ్రామానికి చెందిన అమూల్య పాల్వంచ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కాగా అమూల్య ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నేత ఉడుముల రవీందర్ రెడ్డి వెళ్లి ఫ్రూట్స్ అందించి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా ఈనెల 10వ తేదీన జరిగిన సీఎం కప్ ఆటల పోటీల్లో పాల్గొని తిరిగి గురుకులకు వచ్చిన అమూల్య మరుసటి రోజే జ్వరం, జలుబుతో ఊపిరితిత్తుల తీవ్ర ఇన్ఫెక్షన్‌కు గురైంది. పరిస్థితి విషమించడంతో మంత్రి సీతక్క ప్రమేయంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించి యుద్ధ ప్రాతిపదికన మెరుగైన వైద్యం అందించారు. ఈ నేపథ్యంలోనే రవీందర్ రెడ్డి నేరుగా అమూల్యను ఆసుపత్రికి తరలించడంలో సహకరించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించేందుకు ఆయన సహకరించారు. 10 రోజుల పాటు నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొంది ఈనెల 21న ఆమె డిశ్చార్జి అయి ఇంటికి వచ్చింది. వైద్యానికి డబ్బులు లేక ఆమె తండ్రి వెంకటేశ్వర్లు హైదరాబాదులో నానా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో మాట్లాడి ఆర్థిక సహాయం అందిస్తానని రవీందర్ రెడ్డి హామీ ఇచ్చారు.

## ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి: ప్రభుత్వ ఆరోగ్య సేవా కార్యక్రమాలలో గ్రామీణ వైద్యులు భాగస్వాములు కావాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి కోరారు.ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని పరిధికి మించి వైద్యం చేయకూడదని సూచించారు. ఎవరికైనా తీవ్ర అనారోగ్యం ఉన్నచో సమయస్ఫూర్తితో వ్యవహరించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి త్వరగా చికిత్స అందే విధంగా ఆర్ఎంపీలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ అందించే ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామీణ వైద్యులపై ఉందన్నారు. గ్రామాలలో ఎంతోమంది పేదవర్గాల వారు ఉన్నారని వారందరికీ సేవా భావంతో వైద్య సేవలు అందించి రోగికి క్వాలిఫై డాక్టర్లకు వారధిగా మాత్రమే పని చేసి రోగులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు సలహాలు ఇవ్వాలన్నారు. ప్రజలకు మెరుగైన ప్రాథమిక వైద్య సేవలనుంచి ప్రజలు మన్నన లను పొందాలన్నారు.

## 26న భారీ ప్రదర్శన, ఆవిర్భావ సభ

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : భారత కమ్యూనిస్టుపార్టీ వందో సంవత్స రంలోకి అడుగిడుతున్న సందర్భంగా 26న ఖమ్మంలో పాత కలెక్టరేట్ నుండి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ఎర్రకవాత్ నిర్వహించనున్నామని భక్తరామదాసు కళాక్షేత్రం ఆవిర్భా సభ నిర్వహిస్తామని సి.పి.ఐ జాతీయ సమితిసభ్యులు బాగం హేమంతరావుతెలిపారు. తొలుత ఇందిరానగర్లో ఏర్పాటు చేసిన పైలాను వద్ద శత సంవత్సర ఉత్సవాలకు చిహ్నంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సి.పి.ఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ పాల్గొంటారని ఆయన తెలిపారు. మంగళవారం స్థానిక సి.పి.ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టుపార్టీ స్వాతంత్రానికి పూర్వమే అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నదని స్వాతంత్ర సంగ్రామంలోను ఆ తరువాత జరిగిన అనేక పోరాటాల్లోను సి.పి.ఐ అత్యంత కీలక భూమిక పోషించిందని హేమంతరావు తెలిపారు. హక్కుల సాధన, త్యాగాలు కమ్యూనిస్టుపార్టీ సొంతమని త్యాగాలు, రక్తతర్పణంతోనే కమ్యూనిస్టుపార్టీ 99 ఏళ్ళప్రస్తానం కొనసాగిందన్నారు. ప్రజలకోసం కమ్యూనిస్టులు చేసి పోరాటాల ఫలితంగా భూసంస్కరణలు అమలు అయ్యాయని బ్యాంకుల జాతీయ కరణ జరిగిందని ఇటీవల కాలంలో జాతీయ ఉపాధిహామీపథకం, సమాచార హక్కుచట్టం, 8 గంటల పనివిధానం అనేక హక్కులు కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే వచ్చాయన్నారు. కమ్యూనిస్టులు బలహీన పడిన కారణంగా పాలకులు హక్కులను అరించి వేస్తున్నారని ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని హేమంతరావు తెలిపారు.రైతు రుణమాఫీలో స్పష్టలేదని ఖమ్మం జిల్లాలో 50 శాతం మందికి కూడా రుణ మాఫీ వర్తింప లేదన్నారు. 4వ విడుతగా విడుదల చేసి రూ.3500 కోట్లు రైతుల ఖాతాలో జమకాలేదన్నారు. రైతు బరోసాను ఒకేసారి రూ.15000లు ఇవ్వాలని కౌలు రైతులకు ఇవ్వాలని కోరిన హేమంతరావు, నిరుపేదలకిచ్చే రూ.12000లకు సంబంధించి లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని కోరారు.

## పర్యాటక ప్రాంతాలను సందర్శించిన విద్యార్థులు

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఒకేషనల్ కోర్సులో బాగా%శీ%గా పర్యాటక, ఆతిథ్య సబ్జెక్టులో భాగాంగా, ఏటూరునాగారం జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల నుండి 9వ తరగతి విద్యార్థులను వృత్తి విద్యా బోధకుడు గైని శశిధర్ 9వ తరగతి విద్యార్థులను వరంగల్ పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లడం జరిగిందని, వృత్తి విద్య బోధకుడు గైని శశిధర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వరంగల్‌లో 1000 స్తంభాల గుడి, ప్లానిటోరియం, ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, మ్యూజికల్ గార్డెన్, జూ పార్క్, కుష్ మహల్, కిల్లా వరంగల్ కోట ను, లక్నవరం సరస్సును సందర్శించి, విద్యార్థులకు వాటి ప్రాముఖ్యతని వివరించడం జరిగిందన్నారు. కాకతీయుల కట్టడల గురించి అక్క టూర్ గైడ్ లు ఇచ్చిన సంచారం తెలుసుకున్నారని, హెడ్మాస్టర్ అనుమతి తో వెళ్ళడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొడెం సమ్మయ్య, రాములు సులోచన, సరిత, శోభ, పిఈటి రవి పాల్గొన్నారు.

## క్రిస్టమస్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- కొమరం భీం : క్రిస్టమస్ పండుగను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో ప్రభుత్వం తరపున జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన క్రిస్టమస్ వేడుకలలో ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి రమాదేవిలతో కలిసి పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుల, మత, ప్రాంత విభేదాలు లేకుండా జిల్లాలో అన్ని పండుగలను ప్రజలంతా కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందని, సమాజంలోని అన్ని మతాలను గౌరవించాలని, యేసు ప్రభువు చూపిన మార్గంలో ప్రయాణించి అహింస పద్ధతిని అవలంబించాలని, ఎదుటివారిపై గౌరవభావం కలిగి ఉండాలని, ప్రేమ, అనురాగాలను పంచాలని,యువత సన్మార్గంలో నడిచి తమ భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## గంజాయి దందాపై ఉక్కు పాదం

విశాలాంధ్ర -నేరేడుచర్ల : హుజూర్నగర్ డివిజన్ పరిధిలో గంజాయి క్రయవిక్రయాలు అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు హుజూర్ నగర్ సిఐ చరమందరాజు తెలిపారు. మంగళవారం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో నేరేడుచర్ల, పాలకవీడు గరిడేపల్లి, నేరేడుచర్ల ఎస్సైలతో నిర్వహించిన క్రైమ్ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గతం కంటే పోలిస్తే హుజూర్ నగర్ సర్కిల్ పరిధిలో ఈ ఏడాది నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. గంజాయి అక్రమ రవాణా దందాలో 4 కేసులు నమోదు చేసి 27 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నేరాల అదుపులో విజువల్ సాక్ష్యంగా సీసీ కెమెరాలు అత్యంత కీలకమన్నారు. నేరేడుచర్ల పట్టణంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు రోడ్డు వెడల్పు కార్యక్రమంలో తొలగించారని కొన్ని కెమెరాలు, చెడిపోయాయని పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలతో సమీక్ష చేసి పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ లలో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై వివరించి చైతన్య పరుస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నేరేడుచర్ల మండలంలో కల్లూరు, పెంచికల్ దిన్నె గ్రామాలలో 25 కెమెరాలను బిగించామన్నారు. అలాగే పాలకవీడు మండల కేంద్రాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరుకూడా ఖచ్చితంగా పాటించాలని లేనిచో ఇటీవల భారీగా సవరించిన పెనాలిటీలు విధిస్తామన్నారు. నేరేడుచర్ల పాలకవీడు, గరిడేపల్లి ఎస్సైలు రవీందర్ నాయక్, లక్ష్మీ నరసయ్య, నరేష్ లు ఉన్నారు

## వివో వై29 5జీ లాంచ్

ముంబయి: ఇన్నోవేటివ్ గ్లోబల్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ వివో తన వై సిరీస్‌కు మరో అద్భుతమైన అదనంగా వివో వై 29ను మంగళవారం లాంచ్ చేసింది. ఈ స్మార్ట్‌ఫోన్ దాని సొగసైన, క్రమబద్ధమైన బాడీ, డైనమిక్ లైటింగ్ ఎఫెక్ట్‌తో నెక్స్ట్ లెవల్ డిజైన్‌ను కలిగి ఉంది. ఇది దాని దృఢమైన నిర్మాణానికి సొగసును తెస్తుంది. గ్లేసియర్ బ్లూ, టైటానియం గోల్డ్, డైమండ్ బ్లాక్ రంగుల్లో లభించే వివో వై29 5జీ స్మార్ట్‌ఫోన్ 5500 ఎంఏహెచ్ బ్యాటరీ, 44వాట్ ఫ్లాష్ చార్జ్ ఉన్నాయి. మిలిటరీ గ్రేడ్ షాక్ రెసిస్టెన్స్‌తో పాటు, ఈ స్మార్ట్‌ఫోన్ ఐపి 64 రేటింగ్, ఎస్జిఎస్ సర్టిఫికేషన్‌తో వస్తుంది. ఇది మరింత మన్నికైనది. 4జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.13,999(అన్ని పన్నులతో కలిపి), 6జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.15,499(అన్ని పన్నులతో కలిపి), 8జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.16,999(అన్ని పన్నులతో కలిపి), 8జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.18,999(అన్ని పన్నులతో కలిపి). అసాధారణ కెమెరా సామర్థ్యాలు అన్నీ ఒకే స్మార్ట్‌ఫోన్‌లో ఉన్నాయి. ఈ స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసే వినియోగదారులు రూ.1500 వరకు క్యాష్ బ్యాక్ పొందడానికి అర్హులు, లేదా ఎస్బిఐ కార్డ్, ఐడిఎఫ్సి ఫస్ట్ బ్యాంక్, యెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇతర భాగస్వాముల ద్వారా ఈజీ ఈఎంఐ ఆప్షన్ ద్వారా నెలకు రూ.1399 వద్ద ఫోన్‌ను సొంతం చేసుకోవచ్చు.

## సెన్‌హైజర్ ఆడియో మల్టీటూల్ ప్రొఫైల్ వైర్‌లెస్ విడుదల

న్యూఢిల్లీ: కంటెంట్‌ను క్రియేట్ చేసేటప్పుడు, సంసిద్ధత, సౌలభ్యం కీలకం, అలాగే ఆడియో నాణ్యతను కోల్పోకుండా సులభంగా, త్వరగా ధ్వనిని క్యాప్చర్ చేయడంలో మీకు సహాయపడే వైవిధ్యమైన వైర్‌లెస్ ఆడియో సిస్టమ్ కూడా అవసరం. క్రియేటర్లు, వీడియోగ్రాఫర్‌ల కోసం, సెన్‌హైజర్ ఇప్పుడు ప్రొఫైల్ వైర్‌లెస్‌ను విడుదల చేసింది. రెండు-ఛానల్, 2.4 జీహెచ్‌జెడ్ వైర్‌లెస్ మైక్రోఫోన్ సిస్టమ్ ఇది. మొబైల్ ఫోన్‌లు, కెమెరాలు లేదా కంప్యూటర్‌లకు కనెక్ట్ అవుతుంది. క్లిప్-ఆన్ మైక్, హ్యాండ్‌హెల్డ్ మైక్ లేదా టేబుల్-టాప్ మైక్రోఫోన్‌గా దీనిని ఉపయోగించవచ్చు. సెన్‌హైజర్ ఇండియాలో కంట్రీ మేనేజర్ అండ్ డైరెక్టర్-సేల్స్ ప్రో ఆడియో విపిన్ పుంగలియా మాట్లాడుతూ, నేటి డిజిటల్ మీడియా యుగంలో, భారతదేశంలో మిలియన్ల కొద్దీ కంటెంట్ సృష్టికర్తలు, క్రియాశీల కంటెంట్ వినియోగదారులు ఉన్నారని తెలిపారు.

## ఏఐ సాంకేతికతలకు తెలంగాణ సర్కారు మద్దతు

హైదరాబాద్: స్టార్టప్‌లు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నాయని, సామాజిక ప్రభావాన్ని పెంచే ఏఐ సొల్యూషన్స్‌కు మద్దతు ఇవ్వడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య విభాగాల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. వోక్స్‌సెన్ యూనివర్సిటీ ఫ్యూచర్ టెక్ సమ్మిట్ 2024కు గౌరవ అతిథిగా విచ్చేసిన జయేష్ రంజన్ తన ప్రసంగంలో ఏఐకి సంబంధించిన అన్ని సంభాషణలు కంటే ఆచరణాత్మక వినియోగ కేసులపై దృష్టి సారించాలని ఉద్ఘాటించారు. 'తెలంగాణ ప్రభుత్వం ఇటీవల గ్లోబల్ ఏఐ సమ్మిట్‌ను మేకింగ్ ఏఐ వర్క్ ఫర్ ఎవ్రీ ఒన్ నేపథ్యంతో నిర్వహించింది. ఇది సూచించినట్లుగా, ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చడానికి ఏఐని ఉపయోగించడంపై మనం దృష్టి పెట్టాలి. ఏఐ పరిష్కారాలను అన్వేషించడానికి మరియు అమలు చేయడానికి తెలంగాణ ప్రత్యేక స్థానంలో ఉంది' అని అన్నారు.

## తెలంగాణ గణపతి సెల్ఫ్-హెల్ప్ గ్రూప్ పెప్సికో అవార్డ్

హైదరాబాద్: తెలంగాణ నుండి గణపతి సెల్ఫ్-హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ) పెప్సికో ఇండియా వారి ప్రారంభపు రివల్యూషనరి అవార్డ్స్ 2024లో ఎకనామిక్ ఎంపవర్మెంట్ త్రూ ఎస్‌హెచ్‌జీల శ్రేణిలో విజేతగా నిలిచింది. గణపతి సెల్ఫ్-హెల్ప్ గ్రూప్ ఆర్థిక స్వతంత్రత, తట్టుకునే సామర్థ్యం, లింగ-చేరిక గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా సుమారు 10,000 మంది మహిళల జీవితాలను సానుకూలంగా మార్చింది. తమ పురోగతి భాగస్వామ సిద్ధాంతంతో ప్రేరేపించబడిన పెప్సికో ఇండియా న్యూఢిల్లీలో రివల్యూషనరి కాన్ఫరెన్స్ అండ్ అవార్డ్స్ 2024ను ప్రారంభించడం ద్వారా వ్యవసాయంలో మహిళలను సమర్థవంతులను చేయడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది. వ్యవసాయ రంగంలో మార్పును ప్రోత్సహిస్తున్న సాటిలేని మహిళల తోడ్పాటును ఈ కార్యక్రమం గుర్తించింది.

## నిలకడగా హైదరాబాద్ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్‌లు: నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్: హైదరాబాద్ నవంబర్ 2024లో రూ.3,495 కోట్ల విలువైన గృహ విక్రయాలను నమోదు చేసిందని నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా అంచనాలో పేర్కొంది. ఇది సంవత్సరానికి 7% మరియు 3% నెలవారీగా ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో, రెసిడెన్షియల్ యూనిట్ రిజిస్ట్రేషన్లు మాత్రం 5,516కి పడిపోయాయి. 12% వైవై మరియు 6% ఎంఓఎం తగ్గుదల. మొత్తంగా రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టినప్పటికీ అధిక విలువ కలిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు మాత్రం పెరిగాయి. హైదరాబాద్ నివాస మార్కెట్ నాలుగు జిల్లాలను కలిగి ఉంది. అవి హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి. ఇది ప్రాథమిక, ద్వితీయ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లకు సంబంధించిన గృహ విక్రయాలను కవర్ చేస్తుంది. హైదరాబాద్‌లో, రూ.50 లక్షల కంటే తక్కువ ధర ఉన్న ఆస్తులు సాధారణంగా ఎక్కువ రిజిస్ట్రేషన్‌లకు కారణమవుతాయి. అయితే, ఇటీవలి నెలల్లో చెప్పుకోదగ్గ ప్రీమియమైజేషన్ ట్రెండ్ కనిపించింది. 2023తో పోలిస్తే 2024 నవంబర్‌లో రూ.1కోటి, అంతకంటే ఎక్కువ ధర కలిగిన గృహాల వాటా 12% నుండి 14%కి పెరిగింది.

## వినియోగదారుల హక్కులను కాపాడాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు కాపాడటానికి 1986వ ఏడాది ఈ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. దిన్ని 2019లో మార్పులు చేసి, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంగా రూపొందించారని వివరించారు. వినియోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలను ఆన్లైన్లో చూసి మోసపోవద్దని కోరారు. పాస్ వర్డ్ సులువు అంకెల్లో పెట్టుకోవద్దని, ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దన్నారు. కొనుగోలు చేసిన వస్తువు తయారీ, చిరునామా, గడువు తేదీ కస్టమర్ కేర్ నెంబర్‌ను సరి చూసుకోవాలని కోరారు. మోసానికి గురైతే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి జరిగిన నష్టాన్ని తిరిగి పొందవచ్చన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచుగా రెస్టారెంట్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ అధికారిణి రుక్మిణి, శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, వాలంటరీ ఆర్గనైజర్స్ రఘురామాచారి, గుగులోతు బాలు, మహమ్మద్ రియాజ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## పైలాన్ పనులు పరిశీలించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర - ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శత సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఏర్పాటు చేయనున్న పైలాన్ పనులను సిపిఐ నాయకులు మంగళవారం పరిశీలించారు. శత సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఈనెల 26న పైలాన్ ఆవిష్కరణ జరగనుంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పైలాన్ వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించి శత ఆవిర్భావ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. పరిశీలించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్, హవేలీ ఏరియా కార్యదర్శి ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ పాల్గొన్నారు.

సంపాదకీయం

# మోదీ పరిచారికగా మానవ హక్కుల కమిషన్

జాతీయ మానవ హక్కుల కమిషన్ ను నిర్వీర్యం చేయడానికి కావలసిన ఏర్పాట్లన్నీ మోదీ ప్రభుత్వం చేస్తూనే ఉంది. జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్ష పదవి ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి ఖాళీగా పడి ఉంది. ఆలస్యంగానైనా సరే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి. రాజసుబ్రహ్మణ్యంను జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షునిగా నియమిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన జాతీయ మానవ హక్కుల కమిషన్ లో నియామకాలను ఖరారుచేసి ఉండవచ్చు కానీ నియామక పద్ధతి తీవ్ర వివాదమై కూర్చుంది. కొన్ని పదవులను నియమించడానికి ఉన్నతాధికార కమిటీలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత ఏకాభిప్రాయంతో నియమాకాలు జరగడానికి ఎంపిక కమిటీలు ఉంటాయి. జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడిని, ఇతర సభ్యులను నియమించడానికి ప్రధానమంత్రి నేతృత్వంలో ఒక కమిటీ ఉంది. ఇందులో రాజ్యసభ ఉపాధ్యక్షులు, లోకసభ స్పీకర్, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, లోకసభలో ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉంటారు. కమిటీలో మొత్తం అయిదుగురు ఉంటే ప్రభుత్వానుకూలురు ముగ్గురు ఉన్న కమిటీలో ప్రధానమంత్రి మాట మాత్రమే చెల్లుబాటు అవుతుందని చెప్పడానికి పెద్దగా శ్రమ పడవలసిన అవసరం లేదు. ఈ సారీ అదే జరిగింది రాజ్యసభ అధ్యక్షులు, లోక్‌సభ స్పీకర్ ప్రధానమంత్రికి వంతపాడే వారే కనక ఉభయసభల్లో ప్రతిపక్ష నాయకులు సూచించిన పేర్లను సునాయాసంగా ఖాతర్ చేయకుండా వదిలేశారు. మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలోనే మౌలికమైన లోపాలు ఉన్నాయని కమిటీ సభ్యులైన రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు, లోక్‌సభ, ప్రతిపక్ష నాయకులు విమర్శించారు. మానవ హక్కుల సంఘం నియామకాలు వైవిధ్యానికి చోటివ్వడం లేదన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి వ్యవస్థలన్నింటినీ కేంద్ర ప్రభుత్వానికి దాసోహం అనేట్టుగా మార్చేశారు కనక అవన్నీ జీ హుకుందార్లుగా తయారయ్యాయి. అంతర్జాతీయంగా భారత మానవ హక్కుల సంఘానికి గుర్తింపే కరువై పోయింది. ఈ గుర్తింపు ఇవ్వడానికి అంతర్జాతీయ కమిటీ అంగీకరించడంలేదు. గ్లోబల్ అలయన్స్ ఆఫ్ నేషనల్ హూమన్ రైట్స్ ఇన్‌స్టిట్యూషన్స్ భారత జాతీయ మానవ హక్కుల సంఘాన్ని గుర్తించాలి. కానీ గత ఏడాదిగా ఈ గుర్తింపు ఇవ్వడాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. ఇలా గుర్తింపు ఇవ్వడానికి అర్హతలు నిర్ధారించే కమిటీ భారత మానవహక్కుల కమిషన్‌లో వైవిధ్యం ఉండడం లేదని భావిస్తోంది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి మోదీ ప్రభుత్వం చేస్తున్నది ఏమీలేదు. తమకు నచ్చిన వారిని మానవ హక్కుల కమిషన్ అధిపతులుగా నియమిస్తున్నారు. అంతర్జాతీయస్థాయిలో మన మానవ హక్కుల కమిషన్ మీద విశ్వాసం నానాటికీ దిగజారుతోంది. అంతర్జాతీయ వ్యవస్థ మన మానవ హక్కుల కమిషన్‌ను గుర్తించడాన్ని సంవత్సరంపాటు వాయిదా వేసింది. ఇలా గుర్తింపు రాకుండా ఉండడం ఇది వరసగా రెండవసారి. మోదీ ప్రభుత్వం ఇలాంటి వ్యవస్థలకు ఎవరిని అధిపతులను చేయాలో ముందే నిర్ణయించుకుంటుంది. ఎంపిక కమిటీలో ఎటూ ప్రభుత్వ పక్షానికే మెజారిటీ ఉన్నందువల్ల కమిటీలో ఉన్న ప్రతిపక్ష ప్రతినిధుల మాటను లెక్కచేసే వారే ఉండడం లేదు.

ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న మల్లికార్జున్ ఖడ్గే, రాహుల్ గాంధీ మానవ హక్కుల సంఘం అధ్యక్ష స్థానానికి రోఇంటన్ నారిమన్, కె.ఎం.జోసెఫ్ పేర్లు సూచించారు. ఈ ఇద్దరిలో ఏ పేరూ ప్రభుత్వ పక్షానికి నచ్చలేదు. అందుకే పట్టించుకోలేదు. నియామక కమిటీలో పేరుకు అధికారపక్ష, ప్రతిపక్ష సభ్యులు ఉన్నప్పటికీ అధికారపక్షం వారే మెజార్టీలో ఉంటారు. ప్రతిపక్షాల మాటను ఉదాహరణ ప్రాయంగానైనా వినిపించుకునే ధోరణి ప్రభుత్వ పక్షానికి లేదు. ఎంపిక కమిటీ నామమాత్రంగా మాత్రమే మిగిలిపోతోంది. ప్రధానమంత్రి మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత 2016లో అంతర్జాతీయ వ్యవస్థ భారత మానవహక్కుల సంఘాన్ని గుర్తించడానికి నిరాకరించింది. ఈ సంఘంలో స్త్రీ పురుషులు ఉండవలసినరీతిలో లేకపోవడం, బహుళత్వానికి తావివ్వకపోవడంతో సహా అనేక కారణాలవల్ల అంతర్జాతీయవ్యవస్థ మన మానవహక్కుల సంఘాన్ని గుర్తించడానికి నిరాకరించడం మొదలైంది. అయితే 2017లో మాత్రం అంతర్జాతీయ వ్యవస్థ గుర్తింపు దక్కింది. మళ్లీ 2023 లో ఈ గుర్తింపు దక్కలేదు. ప్రభుత్వజోక్యం లేకుండా మానవ హక్కుల సంఘం స్వతంత్రంగా పనిచేయడానికి వీలు లేకపోవడం కూడా గుర్తింపు దక్కడానికి ప్రధాన కారణం. ప్రభుత్వానికి, అధికార పార్టీకి సంబంధించిన అనేక మందికి ఈ కమిషన్‌లో స్థానం కల్పించి మానవ హక్కుల సంఘం తమను వేలెత్తి చూపకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్త పడ్తోంది. ఒరిస్సా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్.మురళీధర్, రాజస్థాన్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అకిల్ అబ్దుల్ హమీద్ ఖురేషి, త్రిపుర హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిపేరు కమిషన్ సభ్యులుగా నియమించాలని సూచించారు. ప్రతిపక్షాల ప్రతినిధులు సూచించిన పేర్లను పక్కకు తోసేసి ప్రియాంక్ కానుంగో, డా. జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగిని సభ్యులుగా నియమించారు. ప్రభుత్వ ఎంపిక విధానాన్ని తప్పుపడ్తూ ఖడ్గే, రాహుల్ గాంధీ కమిటీ నిర్ణయాన్ని ఆక్షేపిస్తూ అసమ్మతి పత్రం అందజేశారు. ప్రతిపక్ష ప్రతినిధులు జాతీయ మానవహక్కుల కమిషన్ స్వభావాన్ని పరిరక్షించడానికి, ఈ కమిషన్‌ను నెలకొల్పినప్పుడు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణమైన వారి పేర్లే సూచించారు. కానీ మోదీ ప్రభుత్వానికి కావల్సింది మానవ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు సవ్యమైన దర్యాప్తుచేసి, దోషులను కనీసం అభిశంసించి మానవ హక్కులకు భంగం కలగకుండా చూడడం కానేకాదు. తమ ప్రభుత్వం ఎంతగా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినా ప్రభుత్వ పక్షాన్ని సంతోషపెట్టే నివేదికలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నవారే ప్రభుత్వానికి కావల్సింది. అలాంటప్పుడు ఎంపిక విధానం కడిగిన ముత్యంలా ఉంటుందనుకోవడం భ్రమ. మానవ హక్కుల కమిషన్ స్ఫూర్తిని గౌరవించడం దానిని ఏర్పాటు చేసిన లక్ష్యానికి అనుగుణంగా పనిచేయడానికి అవకాశం కల్పించడం తమ బాధ్యత అని అంగీకరించడానికి మోదీ ప్రభుత్వం ఎన్నడూ సిద్ధంగా లేదు. జాతీయ మానవ హక్కుల కమిషన్ పని తీరును వేలెత్తి చూపుతూ కనీసం 16 మానవ హక్కుల సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ సారి కూడా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవడానికి సిద్ధపడలేదు. దళితులు, గిరిజనులు, మైనార్టీల విషయంలో మోదీ ప్రభుత్వ వైఖరి ఇసుమంత కూడా మారడం లేదు. మానవ హక్కుల కోసం పాటుపడే వారిని కేంద్ర ప్రభుత్వం వెంటాడుతూనే ఉంటుంది. మానవ హక్కుల కమిషన్ సిఫార్సులను అంగీకరించే తత్వం కూడా ఈ ప్రభుత్వానికి లేదు.

# వినియోగదారులే తమ హక్కులను కాపాడుకోవాలి !

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రపంచంలో నేడే జన్మించిన శిశువు నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరు వినియోగదారుడే. వినియోగదారుడే వ్యాపారానికి కేంద్ర బిందువు. నేటి డిజిటల్ యుగంలో ఈ-వ్యాపారాలు పెరుగుతున్న వేళ వినియోగదారులు అప్రమత్తంగా ఉండవల్సిన అగత్యం ఏర్పడింది. ఒక వస్తువును కొన్నపుడు లేదా అమ్మినపుడు సరైన న్యాయం పొందడం కనీస అవసరం. 1960ల నుంచే వినియోగదారుల చైతన్య ఉద్యమాలు ప్రారంభం కావడం, దినదినం తీవ్ర రూపం దాల్చడం, వినియోగదారుల మండలి/ఫోరంలు ఏర్పడడం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలు రావడం గమనిస్తున్నాం.

వినియోగదారులకు చట్టం కొన్ని నిర్దిష్టమైన హక్కులను కల్పించింది. సంరక్షణ హక్కు, సమాచార హక్కు, ఎంపిక హక్కు, వివరణ పొందే హక్కు, ఫిర్యాదుల పరిష్కార హక్కు, వినియోగదారుల విద్య హక్కు అనబడే మొత్తం ఆరు హక్కులను భారత వినియోగదారుల పరిరక్షణ చట్టం, 1986

కల్పించడం హర్షదాయకం. వినియోగదారులకు సంబంధించిన అతి ముఖ్యమైన ఈ చట్టం 24 డిసెంబర్ 1986న పార్లమెంట్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏట దేశవ్యాప్తంగా "జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం పాటించటం ఆనవాయితీగా మారింది. వినియోగదారుల దోపిడీ, స్వార్థపరమైన వ్యాపారుల అనైతిక విక్రయ పద్ధతులు, వినియోగదారుల అభిరుచులను తమకు అనుకూలంగా మార్చుకోవడం, మోసపోయిన వినియోగదారులకు తిరిగి న్యాయం అందించడం, జరిగిన నష్టానికి/అసౌకర్యానికి పరిహారం పొందడం, అనారోగ్యకర వ్యాపార పద్ధతులను అరికట్టడం, అవసరమైనపుడు వినియోగదారుల ఫోరం/మండలిని ఆశ్రయించడం లాంటి వెసులుబాట్లను వినియోగదారులకు చట్టం కల్పించడం ముదావహం. జాతీయ వినియోగదారుల హక్కుల దినం వేదికగా పలు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు విద్యాలయాలు, పౌర సమాజంలో వినియోగదారుల హక్కుల పట్ల కార్యశాలలు/సెమినార్లు/ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వినియోగదారుల హక్కులకు భంగం కలిగినపుడు మూడు అంచెల వ్యవస్థ కలిగిన పరిహార మార్గాలను చట్టం కల్పించింది. పరిహార విలువ ఒక కోటి రూపాయల లోపు ఉన్నపుడు జిల్లా స్థాయి వినియోగదారుల వివాదాల పరిహార కమీషన్‌కు ఫిర్యాదు చేయడం, రూ: 1 నుంచి రూ: 10 కోట్ల వరకు రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిహార కమీషన్‌కు, రూ: 10 కోట్లు దాటితే జాతీయ వినియోగదారుల వివాదాల పరిహార కమీషన్‌కు ఫిర్యాదులు చేసి ఉచితంగా న్యాయం పొందవచ్చు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986 తర్వాత కొన్ని సవరణలతో మరో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, 2019ని తీసుకురావడంతో వినియోగదారుడికి న్యాయం జరగడానికి చట్టమే ఒక పదునైన ఆయుధంగా అందించడం జరిగింది. ఐరాస కూడా ప్రతి ఏట 15 మార్చిన "ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం" పాటించుట కొనసాగుతున్నది.

ప్రతి పౌరుడు ఒక వినియోగదారుడిగా తమ హక్కులను తెలుసుకొని, మోసపోకుండా, న్యాయబద్ధమైన సేవలను పొందడానికి అవసరమైన కనీస వినియోగదారుల అవగాహనను కలిగి ఉండాలి. మనల్ని మనమే చట్టం ద్వారా రక్షణ పొందుతూ అనైతిక వ్యాపార పోకడలకు అడ్డుకట్ట వేయాలి. వినియోగదారుల చైతన్య ఉద్యమాల ద్వారా సామాన్య జనాలకు వినియోగదారుల హక్కుల గూర్చి అవగాహన కల్పించాలి. వినియోగదారుడిని మన చట్టాలు శక్తివంతం చేసాయని, వాటి నీడన సురక్షితంగా జీవనయానం సాగించాలని కోరుకుందాం. అడుగడుగున అప్రమత్తతతో ఉందాం. నైతికత గీత దాటిన వ్యాపారవేత్తలకు లేదా కంపెనీలకు లేదా సేవలకు చట్ట తీవ్రతను పరిచయం చేద్దాం.

# అధ్వానంగా ఆర్థికవ్యవస్థ

సి.ఆదికేశవన్

ప్రభుత్వాలు తీసుకునే ఆర్థిక విధానాల మూలంగా ఆర్థికవ్యవస్థ పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదు. అదే సమయంలో దేశ జీడీపీ వృద్ధి నెమ్మదిగా 5.4శాతానికి మాత్రం చేరింది. ప్రైవేటు వినిమయం కుచించుకుపోతోంది. కంపెనీల ఆదాయాలు, లాభాలు తగ్గిపోతున్నాయి. మనది త్వరలో అభివృద్ధి చెందుతున్న దేశం అవుతుందన్న ఆకాంక్షలు ఒక దూరపు కలగా మిగులుతుంది. కొంతమంది ఆర్థికవేత్తలు అభివృద్ధి, ఆకాంక్షలను తిరస్కరిస్తున్నారు. అయితే ఎందుకు ఇది జరుగుతోంది? ప్రధానమైన కారణం ప్రభుత్వ విధానాలే. ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నది ఈ అంశంపై లోతుగా చర్చలు జరపాలి. అభివృద్ధిచెందిన దేశంగా భారతదేశం అనుసరిస్తున్న మార్గాన్ని తప్పనిసరిగా సమీక్షించాలి. పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ, ప్రధాన ఆర్థిక సలహాదారు అనేక కంపెనీల లాభాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఆయా కంపెనీల్లో ఉద్యోగులకు వేతనాలు పెరగడంలేదు. జీడీపీ వృద్ధి 5.4శాతమే ఉన్నందున దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఆందోళనకలిగిస్తోంది. ప్రైవేటు వినిమయం కుచించుకుపోతుండగా కార్పొరేట్ల ఆదాయం కూడా తగ్గుతుందని ప్రభుత్వం చెబుతోంది. మధ్యతరగతిని మరింత పిండివేసేందుకు దోహదంచేసే ద్రవ్యోల్బణం పెరుగుతూనేఉంది. మధ్యతరగతి పరిస్థితి అధ్వాన్నంగా తయారవడం జరుగుతోంది. అదే సమయంలో పేదల పరిస్థితిమరింత దిగజారుతోంది. సరైనచర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి అవకాశం ఉన్నప్పటికీ అది నిష్క్రియాపరత్వంగా ఉంటోంది. సామాన్యప్రజలను ఉపేక్షించి సంపన్నులకు ఉపయోగపడే విధానాలను అనుసరిస్తోంది.

**ఆర్థిక నత్తనడక:**

దేశ జీడీపీ వృద్ధి నిలిచిపోతోంది. ప్రైవేటు వినిమయం 56.28శాతం మాత్రమే ఉంది. ఈ త్రైమాసికంలో జీడీపీ పెరుగుదల 6శాతం మాత్రమేఉంది. గత త్రైమాసికంలో 7.4శాతం ఉన్నది. ఇది క్రమంగా దిగజారింది. ఈ పరిస్థితితలెత్తడానికి అధిక ద్రవ్యోల్బణం ప్రత్యేకించి ఆహారవస్తువుల ధరలు పెరగడం ప్రధానకారణం. 2024 అక్టోబరులో కూరగాయల ధరలు 40శాతం పెరిగాయి. టమోటాలు కిలో రూ.120 కాగా, ఉల్లిపాయలు కిలో రూ.50-60లు ఉంది. ఫలితంగా ఆహార ద్రవ్యోల్బణం నాలుగేళ్ల క్రితం 3శాతం కాగా, అది నేడు 6.3శాతానికి పెరిగిపోయింది. గృహస్థులు అత్యవసర వస్తువులను కొనుగోలుచేసే బడ్జెట్‌లో అరశాతం మాత్రమే కేటాయించగలుగుతున్నారు. చాలా జాగ్రత్తగా ఖర్చుచేయవలసి వస్తోంది. ప్రైవేటురంగంలో ఈపరిస్థితి కొట్టవచ్చినట్లుగా ఉంది. మారుతి, సుజికి, హుండాయ్, హెూండా తదితర ఆటోమొబైల్ కంపెనీలు ఏనాడూ లేనంతగా డిస్కౌంట్లు ఇస్తున్నాయి. డిమాండ్

పడిపోవడమే ఇందుకు కారణం. 70వేల కార్లు విక్రయం కాగా, షెడ్లలో నిలిచిపోయాయి. దేశవ్యాప్తంగా అమ్మకాలు ఏమాత్రం ఉండటంలేదు. వినిమయ వస్తువులు సబ్బులు, టూత్‌పేస్టులు, బిస్కెట్లు, తదితర వస్తువుల అమ్మకాలు తగ్గిపోయి ఆర్థిక పరిస్థితి దిగజారుతోంది.

**నిలిచిపోయిన ఆదాయాలు:**

ప్రజల ఆదాయాలు ద్రవ్యోల్బణంతో పోటీపడటంలో విఫలమవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వేతనాలు ఆరు సంవత్సరాల కాలంలో ఒక్కశాతం మాత్రమే పెరిగాయని గణాంకాల మంత్రిత్వశాఖ సర్వే తెలియజేసింది. 2017-18లో వేతనం రూ.12,847 కాగా, 2023-24లో అది 13,006కి మాత్రమే చేరింది. గ్రామీణప్రాంతాల్లో ఆదాయాలు నెలకు 3శాతం తగ్గాయి. అంటే రూ.9107 నుంచి రూ.8842కు తగ్గిపోయింది. అనేక కంపెనీలు రికార్డుస్థాయిలో లాభాలు వచ్చాయని ప్రకటిస్తున్నాయి. ఇదే సమయంలో ఉద్యోగుల వేతనాలు పెరగడంలేదు. ఆదాయంలో అసమానతలు అపారంగా ఉన్నాయి.

**ప్రభుత్వ విధానాల పాత్ర:**

సంక్షోభంనుంచి బైటపడి పరిస్థితిని మెరుగుపరచేందుకు అనేక మార్గాలుఉన్నప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడంలేదు. ఉదాహరణకు పెట్రోలు, డీజిల్ ధరలు తక్షణం తగ్గించి ప్రజలకు ఊరట కలిగించవచ్చు. ప్రపంచమార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గిపోయినప్పటికీ, ప్రభుత్వం తనకు లభించే ఆదాయంలో వినిమయదారులకు ఏమాత్రం కేటాయించడం లేదు. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు రికార్డుస్థాయిలో ఆదాయాలు పొందుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 81వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం పొందింది. అయినప్పటికీ కొనుగోలుదారులపై ధరలు మాత్రం మారడంలేదు. ప్రభుత్వ ధనానికి ఏ మాత్రం లోటులేకుండా జీఎస్‌టీ రేట్లను తగ్గించవచ్చు. కేంద్ర ప్రభుత్వం తలపెడితే రాష్ట్రాలకు 70వేల కోట్ల ఆదాయం లభించేలాగా జీఎస్‌టీ తగ్గించి అమలు చేయవచ్చు. జీఎస్‌టీ రేటు తగ్గితే, వినిమయదారులు ఖర్చును పెంచుతారు. అప్పుడు వ్యాపారంపై పెట్టుబడులను పెంచుతారు. కాని, ప్రభుత్వం జీఎస్‌టీ రేట్లను పెంచుతోంది.

> ప్రభుత్వ ధనానికి ఏ మాత్రం లోటులేకుండా జిఎస్‌టీ రేట్లను తగ్గించవచ్చు. కేంద్ర ప్రభుత్వం తలపెడితే రాష్ట్రాలకు 70వేల కోట్ల ఆదాయం లభించేలాగా జిఎస్‌టీ తగ్గించి అమలు చేయవచ్చు. జిఎస్‌టీ రేటు తగ్గితే, వినిమయదారులు ఖర్చును పెంచుతారు. అప్పుడు వ్యాపారంపై పెట్టుబడులను పెంచుతారు. కాని, ప్రభుత్వం జిఎస్‌టీ రేట్లను పెంచుతోంది.

**ప్రభుత్వ నిర్వహణ ఏ మాత్రం సమర్థంగా లేదు:**

పెట్టుబడుల ఉపసంహారణ విఫలమైంది. ప్రైవేటురంగం సక్రమంగా పనిచేయడంలేదు. అదే సమయంలో ప్రభుత్వరంగ పరిశ్రమలు గణనీయంగా ఆదాయాన్ని సాధించవచ్చు. ఈ ఆర్థికసంవత్సరంలో ప్రభుత్వం కేవలం 6శాతం మాత్రమే పెట్టుబడుల ఉపసంహారణ చేయగలిగింది. 50వేల కోట్లుపెట్టుబడులు ఉపసంహరించాలని లక్ష్యంగా పెట్టుకుని 3000కోట్లు మాత్రమే ఉపసంహరించగలిగింది. ప్రభుత్వం గరిష్టపాలన కనీస ప్రభుత్వం ఏర్పాటు చేస్తానని వాగ్దానంచేసింది. ఈ విషయంలో తన చేతగానితనాన్ని ప్రదర్శించింది. ఆర్థికవ్యవస్థ ప్రతికూలమార్గంలో పయనిస్తోంది.ఆర్థిక పెరుగుదల గొప్పగా ఉందని ప్రభుత్వం డప్పాలుకొట్టుకోవడం మినహా మరేమీలేదు.

# తగ్గుతున్న బ్యాంకు డిపాజిట్లు

గోపాలుని రాధాకృష్ణ

గడిచిన కొంతకాలంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్లు గణనీయంగా పడిపోతున్నాయా అంటే అవును అనే చెప్పక తప్పదు. ఇటీవల జరిగిన పలు సమావేశాల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ శక్తి కాంత్ దాస్ ఈ విషయమై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. దీన్నిబట్టి చూస్తే నేడు బ్యాంకింగ్ రంగం ఒక పెద్ద సవాల్‌ను ఎదుర్కోనుంది. దీన్ని సరిదిద్దకపోతే బ్యాంకింగ్ రంగమే ప్రశ్నార్థకంగా మారనుంది.

అసలు బ్యాంకింగ్ వ్యాపార సరళిని గమనిస్తే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి, తిరిగి ఆ మొత్తాలను అవసరం ఉన్నవారికి రుణాల రూపంలో అందజేస్తుంది. మరి బ్యాంకులకు లాభాలు ఎలా వస్తాయి అంటే తక్కువ వడ్డీకి డిపాజిట్లు సేకరించి, ఎక్కువ వడ్డీకి రుణాలను అందిస్తాయి. ఈ వ్యత్యాసమే బ్యాంకులకు లాభార్జన. ఈ వ్యాపారం అంతా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తేనే సాధ్యం. తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది జూలై 12 నాటికి బ్యాంకుల డిపాజిట్లు 11 శాతం పెరగ్గా రుణాలు 14 శాతం పైగా నమోదయ్యాయి. రుణ, డిపాజిట్ల వృద్ధిలో ఈ తేడా 20 ఏళ్లలో ఇదే తొలిసారి. ఆందోళనకర విషయం డిపాజిట్ల కంటే అప్పులు తీసుకునే వారి సంఖ్య ఎక్కువ కావడమే. గడిచిన 10 త్రైమాసికాల్లో క్రెడిట్ వృద్ధి కన్నా డిపాజిట్ల వృద్ధి తక్కువగా కనిపిస్తోంది. డిపాజిట్ల వృద్ధిని మెరుగుపర్చుకోవాల్సిందిగా ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సూచించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పనితీరుపై జరిగిన సమీక్ష సమావేశంలో కొన్ని నెలలుగా రుణాల జారీతో పోలిస్తే డిపాజిట్ల వృద్ధిరేటు 300-400 బేసిస్ పాయింట్లు (3-4) శాతం తక్కువగా ఉంటోందన్నారు. అందువల్ల భవిష్యత్తులో రుణాల జారీకి ఇబ్బందులు ఏర్పడవచ్చన్న ఆందోళనను వెలిబుచ్చారు. డిపాజిట్ల వృద్ధి, రుణాలు-డిపాజిట్ల నిష్పత్తి, ఆస్తుల నాణ్యత పైన మంత్రి సమీక్షించారు. వినూత్న పథకాలతో డిపాజిట్లు పెంచుకోవాలని, ప్రధాన బ్యాంకింగ్ వ్యాపారంపై దృష్టి సారించాలని కూడా పిలుపునిచ్చారు.

బ్యాంకింగ్ రంగం డిపాజిట్ల మందగమనాన్ని గమనిస్తే దేశ ప్రజలకు ఎక్కువ మొత్తంలో బ్యాంక్ అకౌంట్లు ఉన్నప్పటికీ, ఆ స్థాయిలో డిపాజిట్లను సేకరించలేకపోతున్నాయి. సమాజంలోని ప్రతి ఒక్కరికి బ్యాంకింగ్, ఆర్థిక సేవలను అందించేందుకు వీలుగా కేంద్రం ప్రవేశపెట్టిన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అంతగా సత్ఫలితాలను ఇవ్వలేకపోయింది. దీనిలో భాగంగానే గతంలో జన్‌ధన్ ఖాతాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఈ ఖాతాలు ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలకు మాత్రమే ఉపయోగపడ్డాయి. అంటే నేరుగా పథకాల మొత్తం వారి వారి ఖాతాల్లోకి జమ అయిపోతుంది. అయితే ఈ ఖాతాల్లో 35 శాతం లావాదేవీలు లేవు. అసలు బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్ల తగ్గుదలకు కేంద్రమే బాధ్యత వహించాలి. ఏ బడ్జెట్ చూసినా బ్యాంకు డిపాజిట్ దారులకు అనుకూలంగా ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేకపోవడమే. అంతేకాక వారు ఆ డిపాజిట్లపై సంపాదిస్తున్న వడ్డీపై కూడా ఆదాయం పన్ను వసూలు చేయడమేంటన్న విమర్శలు బాగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వాలు కూడా ఇతర రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి తప్ప బ్యాంకుల్లో డిపాజిట్ల పెరుగుదలపై శ్రద్ధ చూపించకపోవడమే. యంగ్ ఇండియా పేరుతో కేంద్రమే మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ మార్కెట్లు, ఇన్సూరెన్స్ పథకాలు, పెన్షన్ పథకాలు వైపు మొగ్గు చూపేలా చేస్తోంది. మూలధన లాభాల (క్యాపిటల్ గెయిన్స్) పై అన్ని బడ్జెట్లలోను ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారు. దీంతో ప్రజలు ఈక్విటీ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్‌పై దృష్టి సారిస్తున్నారు. చివరికి బ్యాంకుల్లో మిగిలింది సీనియర్ సిటిజన్లు మాత్రమే. ఎందుకంటే వారు వృద్ధాప్యంలో మరోచోట పెట్టుబడి పెట్టే సాహసం చేయలేరు. వారి పెట్టుబడులు సురక్షితంగా ఉండాలంటే బ్యాంకులపైనే ఆధారపడ్డారు. అయినా ప్రభుత్వాలకు వీరి పట్ల చిన్న చూపేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వీరు బ్యాంకుల్లో వేసే కాల పరిమితితో కూడిన డిపాజిట్ల వల్లనే రుణాలు ఇవ్వగలుగుతున్నారు. అదే స్వల్పకాలిక డిపాజిట్లతో రుణాలు అందించడం ఇబ్బందిగా మారేది.

వడ్డీ రేట్ల విషయంలో బ్యాంకులకు స్వేచ్ఛ కూడా ఇచ్చామని మాజీ గవర్నర్ శక్తి కాంత్ దాస్ చెబుతున్నప్పటికీ అది అంతగా ఆకర్షణీయంగా ఉండటంలేదు. వృద్ధాప్యంలో దాచుకున్న వడ్డీపై కూడా ఆదాయంపన్ను వసూలుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో భారత్ కూడా ఇందుకు మినహాయింపు కాదని పాలసీ వడ్డీరేట్ల కోత గురించి ఆలోచించడం తొందరపాటే అంటూ గవర్నర్ తాజాగా పేర్కొనడం విశేషం. ప్రస్తుత వడ్డీరేట్లతో రిటైల్ డిపాజిట్ల సమీకరణకు బ్యాంకులకు కష్టతరంగా మారింది. అందుకు పరిమితకాల పథకాలను ప్రారంభించాల్సి వస్తుంది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి చూస్తే ఇప్పటివరకు రుణాల వృద్ధి విలువ రూ. 50 లక్షల కోట్లు కాగా డిపాజిట్ల వృద్ధి విలువ అంతకుమించి రూ.61 లక్షల కోట్లుగా ఉందని చెప్తున్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో మాత్రం రుణాల వృద్ధితో పోలిస్తే డిపాజిట్ల వృద్ధి నెమ్మదించిందని తాజా నివేదికలో పేర్కొంది. ఏమైనా ఆర్‌బీఐ కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రభుత్వరంగ బ్యాంకుల్లో డిపాజిట్ వృద్ధికి కృషి చేయాల్సిందే. ప్రోత్సాహకాలను ప్రకటించాలి. అంతేకాక వడ్డీ ఆదాయంపై పన్ను మదింపు చర్యలను పునరాలోచించాలి. ఎంగర్ ఇండియా పేరుతో యువతను బ్యాంకుల వైపు ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ రేట్లను సమీక్షించాలి. అప్పుడే బ్యాంకుల్లో డిపాజిట్ వృద్ధి రేటు పెరిగే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో దేశ ఆర్థికాభివృద్ధికి విఘాతం ఏర్పడే ప్రమాదం కూడా లేకపోలేదు.

సెల్: 9885390232

# ముగిసిన శ్యామ్ బెనెగల్ అంత్యక్రియలు

**ముంబై:** ప్రముఖ సినీ దర్శకుడు శ్యామ్ బెనెగల్ అంత్యక్రియలు ముగిశాయి. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని శివాజీ పార్క్ విద్యుత్ స్మశాన వాటికలో రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో బెనెగల్ అంత్యక్రియలు నిర్వహించారు. శ్యామ్ బెనెగల్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. శ్యామ్ బెనెగల్ కిడ్నీ సంబంధ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మరణించారు. సామాజిక సమస్యలు, ఆర్థిక అసమానతలపై ఆయన సినిమాలు రూపొందించారు. ఎనిమిది సార్లు జాతీయ అవార్డులు అందుకున్నారు.

# జనవరి 8న 'జమిలి'పై జేపీసీ భేటీ

**న్యూఢిల్లీ:** 'ఒకే దేశం... ఒకే ఎన్నిక' బిల్లుపై ఏర్పాటయిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ వచ్చే నెల 8న తొలిసారి సమావేశం కానుంది. కమిటీ చైర్‌పర్సన్‌తో పాటు సభ్యు లంతా హాజరవుతారు. సమావేశ అజెండా వివరాలను కేంద్ర న్యాయ శాఖ కమిటీ సభ్యులకు తెలియజేయనుంది. జనవరి 8న ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుం దని కమిటీ జాయింట్ సెక్రెటరీ గుండా శ్రీనివాసులు ఒక ప్రకటన ద్వారా మీడియాకు వెల్లడించారు. 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లుపై ఏర్పాటయిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ వచ్చే జనవరి 9న తొలిసారి సమావేశం కానుందని, సభ్యులందరూ సమావే శానికి హాజరు కావాలని కూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ ఎంపిక లోపభూయిష్టం: కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ ఎంపికలో సరైన విధానాన్ని పాటించలేదని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఎంపిక ప్రక్రియ ప్రాథమిక స్థాయిలోనే లోపభూయిష్టంగా సాగిందని తన అసమ్మతి తెలియజేస్తూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. చైర్మన్‌గా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ నియమితులైన సంగతి తెలిసిందే. 'ఈ తరహా అంశాల్లో పరస్పర సంప్రదింపులు, ఏకాభిప్రాయ సాధన వంటి సంప్రదాయాన్ని విస్మరించారు. సమావేశంలో లేవనెత్తిన చట్టబద్ధమైన ఆందోళనలను పక్కనపెట్టి... పేర్లను ఖరారు చేయడానికి సంఖ్యాపరమైన మెజార్టీపై ఆధారపడ్డారు' అని ఆరోపించింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా పనిచేసిన జస్టిస్ అరుణ్‌కుమార్ మిశ్రా ఈ ఏడాది జూన్ 1న పదవీ విరమణ చేయగా, సభ్యురాలు విజయభారతీ సయానీ ప్రస్తుతం తాత్కాలిక చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. కొత్త చైర్‌పర్సన్ ఎంపికపై డిసెంబరు 18న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. జస్టిస్ రామసుబ్రమణియన్‌ను నియమిస్తూ సోమవారం నిర్ణయం వెలువడింది. సభ్యులుగా ప్రియాంక్ కనూంగో, డాక్టర్ జస్టిస్ బిద్యుత్‌రంజన్ షడంగిని నియమించారు.

# కేన్-బెట్వా నదీ అనుసంధాన ప్రాజెక్టుకు నేడు శంకుస్థాపన

**ఛాతర్‌పూర్:** కేన్-బెట్వా నదీ అనుసంధాన జాతీయ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్రమోదీ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ ప్రణాళికలో భాగంగా దేశంలో తొలిసారి నదీ అనుసంధానం ప్రాజెక్టు కార్యం రూపం దాల్చింది. మధ్యప్రదేశ్‌లోని ఛాతర్‌పూర్‌లో దౌదెన్ డ్యామ్‌ను నిర్మిస్తున్నారు. కేన్ నదిలో ప్రవహించే అదనపు నీటిని.. ఉత్తరప్రదేశ్‌లోని బెట్వా నదికి తరలిస్తారు. 2021లోనే ఈ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం దక్కింది. కేబీఎల్పీ ప్రాజెక్టు కోసం సుమారు 44,605 కోట్లు ఖర్చు చేయనున్నారు. రాజకీయ, పర్యావరణ కారణాల వల్ల ప్రాజెక్టు ఆలస్యం అయ్యింది. నదీ అనుసంధానం ద్వారా యూపీలోని బేట్వా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న బుందేల్‌ఖండ్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరగనుంది. సుమారు 77 మీటర్ల ఎత్తు, రెండు కిలోమీటర్ల వెడల్పుతో కేన్-బెట్వా ప్రాజెక్టు కోసం డ్యామ్‌ను నిర్మిస్తున్నారు. పన్నా టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఈ ప్రాజెక్టును కడుతున్నారు. దౌధాన్ డ్యామ్‌తో పాటు సుమారు 230 కిలోమీటర్ల పొడవున కాలువ కూడా నిర్మించనున్నారు.

# అత్యాచార బాధితులకు ఉచిత చికిత్స అందించాల్సిందే: ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ:** అత్యాచారం, యాసిడ్ దాడి, లైంగిక వేధింపుల బాధితులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు ఉచిత వైద్య చికిత్సను నిరాకరించడానికి వీల్లేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఉచిత వైద్యంలో భాగంగా మెడికల్ పరీక్షలు కూడా డబ్బులు తీసుకోకుండా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. లైంగిక దాడుల బాధితులకు చికిత్స నిరాకరించడం చట్ట రీత్యా నేరమని, సంబంధిత హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, మేనేజ్‌మెంట్ జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని కోర్టు హెచ్చరించింది. 16 ఏళ్ల బాలికపై ఆమె తండ్రి అత్యాచారం చేసిన కేసులో ఢిల్లీ హైకోర్ట్ జడ్జిలు ప్రతిభా ఎం సింగ్, అమిత్ శర్మలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. లైంగిక దాడుల నుంచి బయటపడిన బాధితులు ఉచిత వైద్య చికిత్స విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యాయస్థానం విచారం వ్యక్తం చేసింది. ఉచిత చికిత్సలో భాగంగా అవసరమైన అన్ని పరీక్షలు, రోగ నిర్ధారణ టెస్టులు చేయడంతో పాటు దీర్ఘకాలిక వైద్య సంరక్షణ కూడా అందించాలని స్పష్టం చేసింది. బాధితులకు అవసరమైన కౌన్సెలింగ్ కూడా ఇవ్వాలని ఢిల్లీ హైకోర్ట్ తెలిపింది.

# పేదలు బతికేదెలా?

- ధరలు పెరుగుతుంటే ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్రపోతోంది
- కేంద్రంపై రాహుల్ ధ్వజం

**న్యూఢిల్లీ:** దేశంలో సామాన్య ప్రజలు బతికే పరిస్థితి కనిపించడం లేదని, పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్ర పోతోందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'కొన్ని రోజుల క్రితం స్థానిక కూరగాయల మార్కెట్‌కు వెళ్లాను. అక్కడ సామాన్యులను కలిసి మాట్లాడాను. పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న విషయాలకు వారు రాజీ పడాల్సి వస్తుంది. గతంలో రూ.40 ఉండే కిలో వెల్లుల్లి ధర ప్రస్తుతం రూ.400 పలుకుతోంది. బఠానీలు కేజీ 120 పలుకుతోంది. ఇలా ధరలు పెరిగిపోతుంటే... ప్రజలు ఇంక పొదుపు ఏం చేయగలుగుతారు. ద్రవ్యోల్బణం పెరగడంతో సామాన్యుడి వంట గది బడ్జెట్ వారి చేయి దాటిపోతోంది. కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోంది' అని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇటీవల గిరినగర్‌లోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. అక్కడ సామాన్యులతో ధరల పెరుగుదలపై చర్చించారు. అంతేకాకుండా దానివల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ధరలు పెరగడంతో ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా కొందరు మహిళలు రాహుల్‌కు తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.

# కేరళలో అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటు

### కేంద్ర మంత్రి ఖట్టర్‌తో రాష్ట్ర విద్యుత్ మంత్రి భేటీ

**తిరువనంతపురం:** కేరళలో అణువిద్యుత్ కేంద్రం స్థాపించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ విషయంపై ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కె.కృష్ణన్‌కుట్టి, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో అత్యున్నత స్థాయి చర్చల్లో పాల్గొన్నట్లు తెలిపాయి. తమ రాష్ట్రంలో సమృద్ధిగా ఉన్న థోరియం నిక్షేపాలను సద్వినియోగం చేసుకుని... వాటినుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కేరళకు సరఫరా చేయాలని కేంద్ర మంత్రికి సమర్పించిన వినతిలో పేర్కొన్నట్లు వివరించాయి. కేంద్ర ప్రభుత్వం అణు విద్యుత్‌ను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందని... దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూరిస్తే... ప్లాంటు ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం అవుతుందని మనోహర్ లాల్ ఖట్టర్ సూచించినట్లు పేర్కొన్నాయి. కేరళ విద్యుత్ లోటును ఎదుర్కొంటూ పక్క రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు గురించి నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రి సూచించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ విషయం చర్చల దశలోనే ఉందని... దీనికోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. మరోవైపు రాష్ట్రంలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటును కేరళ రాష్ట్ర ప్రభుత్వం కోరలేదని, రాష్ట్రంలోని థోరియం నిక్షేపాలను కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకోవాలని మాత్రమే సూచించిందని రాష్ట్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వర్గాలు పేర్కొనడం గమనార్హం. ఈ సమావేశం గురించి మంత్రి కె.కృష్ణన్‌కుట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్థికసాయం కోరామని తెలిపారు. 'ప్రభుత్వ అంచనాల ప్రకారం 2030 నాటికి కేరళకు దాదాపు 10,000 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతుంది. స్థానికంగా ఇంత పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేయడం జరగని పని. అందువల్ల కేంద్రం లేదా ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 4,260 మెగావాట్ల సరఫరాను మాత్రమే నిల్వ చేసే సదుపాయాలు ఉన్నాయి. మరింత విద్యుత్ కొనుగోలు చేయడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు మనకు లేవు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కోరాం' అని వెల్లడించారు. అంతేకాకుండా బార్హ్ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ నుంచి 177 మెగావాట్ల విద్యుత్ సరఫరా కాంట్రాక్టు మార్చి వరకే ఉందని... దానిని జూన్ వరకు పొడిగించాలని కేంద్రాన్ని అభ్యర్థించామన్నారు. సరఫరాను 177 మెగావాట్ల నుంచి 400 మెగావాట్లకు పెంచాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# రామేశ్వరం తీరంలో రహస్య కెమెరా కలకలం

### దుస్తులు మార్చుకోవడానికి వెళ్లి గుర్తించిన మహిళ

**చెన్నై:** తమిళనాడు లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామేశ్వరంలో ఓ భక్తురాలికి చేదు అనుభవం ఎదురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పుదుకోట్టైకి చెందిన మహిళ కుటుంబసమేతంగా సోమవారం రామేశ్వరం దేవాలయానికి వెళ్లారు. ఆలయ ఆచారాల్లో భాగంగా అగ్నితీర్థం వద్ద సముద్ర స్నానం చేసి... దుస్తులు మార్చుకోవడానికి ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటుచేసిన గదిలోకి వెళ్లారు. అయితే అందులో రహస్యంగా దాచిఉంచిన కెమెరాలను ఆమె గుర్తించి కుటుంబ సభ్యులకు, ఆలయ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కెమెరాలను స్వాధీనం చేసుకొని.. బూత్ నిర్వాహకుడు రాజేష్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణలో సమీపంలోని టీ స్టాల్‌లో పని చేస్తున్న మీరా మొయిదీన్ అనే వ్యక్తి కూడా రాజేష్‌కి సహకరించినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# గాంధీ బెళగావి సెషన్‌కు 100 ఏళ్లు

### 26, 27 తేదీల్లో కాంగ్రెస్ చారిత్రక వేడుక: వేణుగోపాల్

**న్యూఢిల్లీ:** ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షతను మహాత్మాగాంధీ చేపట్టి 100ఏళ్లు అయిందని, 1924లో కాంగ్రెస్ బెళగావి సెషన్ శతాబ్ది వేడుకను ఈనెల 26,27 తేదీల్లో చరిత్రాత్మకంగా నిర్వహిస్తున్నామని ఎంపీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. 200 మందికిపైగా నాయకులు పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ నాయకులకు ఈ వేడుక ప్రతిష్ఠాత్మకమైనదన్నారు. స్వాతంత్ర్యం సాధనకుగాను అహింస, సహకార నిరాకరణ అజెండాతో బెళగావిలో మహాత్మా గాంధీ ప్రసంగించారని గుర్తుచేశారు. అంటరానితనాన్ని పారద్రోలడం, ఐక్యతను పెంపొందించడం, సామాజిక-ఆర్థిక అసమానతలు రూపుమాపడం, న్యాయం-సమానత్వ సిద్ధాంతాన్ని అమలు చేయడం వంటివి గాంధీ ప్రసంగంలోని ముఖాంశాలుగా వేణుగోపాల్ చెప్పారు. నాటి సదస్సుకు వందేళ్లు అయిన సందర్భాన్ని జరుపుకునేందుకు బెళగావిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని 'నవ సత్యాగ్రహ సమావేశం' పేరుతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షతను మహాత్మాగాంధీ చేపట్టిన చోటే ఈ సమావేశం జరుగుతుంది. ఈ చారిత్రక వేడుక కోసం కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అన్ని ఏర్పాట్లు చేసింది. సీడబ్ల్యూసీ సభ్యులతో పాటు దాదాపు 200 మంది నాయకులు కార్యక్రమంలో పాల్గొంటారు' అని వేణుగోపాల్ తెలిపారు. 26వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు మహాత్మాగాంధీ నగర్‌లో సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. 27వ తేదీ ఉదయం 11.30 గంటలకు 'జై బాపు-జై భీమ్-జై సంవిధాన్' ర్యాలీని బెళగావిలో చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీలు, ఏఐసీసీ నాయకులు, లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. సీడబ్ల్యూసీ సమావేశంలో ఐఎన్‌సీ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని వేణుగోపాల్ చెప్పారు. బీజేపీ పాలనలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులు, ఆర్థిక అసమానతలు, ప్రజాస్వామ్యం ఖూనీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై దాడులు వంటి అంశాలపై చర్చలు, తీర్మానాలు జరుగుతాయని వేణుగోపాల్ తెలిపారు.

# కొట్టుకున్న కౌన్సిలర్లు

### చండీగఢ్ కార్పొరేషన్ సమావేశం రసాభాస

**చండీగఢ్:** చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు కొట్లాటకు దిగారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల రాజ్యసభలో బీఆర్ అంబేద్కర్‌ను కించపర్చేలా వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్, ఆప్ కౌన్సిలర్‌లు తప్పుపట్టారు. ఈ మేరకు అమిత్ షాకు వ్యతిరేకంగా కార్పొరేషన్‌లో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టి... దానికి ఆమోదముద్ర వేయించుకున్నారు. అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని కూడా ఆ తీర్మానంలో డిమాండ్ చేశారు. దాంతో ఈ తీర్మానంపై ఓటింగ్‌కు పోలింగ్ అధికారిగా వ్యవహరించిన అనిల్ మాషీ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. రాహుల్ గాంధీపై ఉన్న ఇండియా హెరాల్డ్ కేసును ప్రస్తావించారు. అది కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య గొడవకు దారితీసింది. రెండు పార్టీల సభ్యులు బాహాబాహీకి దిగారు. కాంగ్రెస్ హయాంలోనే అంబేద్కర్‌కు అవమానం జరిగిందని, భారత ప్రధాని నెహ్రూ హయాంలోనే అంబేద్కర్‌ను అవమానించారని బీజేపీ కౌన్సిలర్‌లు ఆరోపించారు. దాంతో కాంగ్రెస్ కౌన్సిలర్‌లు బీజేపీపై మండిపడ్డారు. రెండు పార్టీల సభ్యులు ఒకరిపై ఒకరు కొట్లాడుకోవడంతో గందరగోళం నెలకొంది.

### కొడుకును స్కూల్ బస్ ఎక్కిస్తుండగా

# మహిళకు విద్యుత్ షాక్... పరిస్థితి విషమం

**బెంగళూరు:** కర్నాటకలోని కల్బుర్గికి చెందిన ఒక మహిళ తన కుమారుడిని స్కూల్ బస్సు ఎక్కిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. వివరాల్లోకి వెళితే... 34 ఏళ్ల మహిళ ఎప్పటిలాగానే సోమవారం కూడా దివ్యాంగుడు అయిన తన కొడుకును స్కూల్ బస్సు ఎక్కించేందుకు తీసుకెళ్లింది. కాసేపు స్టాప్‌లో వేచిచూసిన తర్వాత బస్సు రావడంతో కొడుకును బస్సు ఎక్కించేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో ఆమెకు విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయింది. స్థానికులు గమనించి ఆమెను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ ఆమె శరీరం నుంచి మంటలు రావడం చూసి వెనక్కి తగ్గారు. వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేసి బస్సును ముందుకు తీయించారు. ఆ తర్వాత తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన మహిళను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఘటనలో ఆమె కొడుకుకు కూడా గాయాలయ్యాయి. అయితే అతనికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్కూల్ బస్సు ఆగిన చోట ఓ విద్యుత్ వైర్ తెగి వేలాడుతుండటమే ప్రమాదానికి కారణమని వారు వివరించారు. తెగి వేలాడుతున్న విద్యుత్ వైర్ స్కూల్ బస్సుకు తగలడంతో బస్సు విద్యుత్ ప్రసరణ జరిగిందని, ఆ బస్సును బాధిత మహిళ పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురైందని పోలీసులు నిర్ధారించారు. విద్యుత్ వైర్ వేలాడుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హిమాచల్‌లో భారీగా మంచు

- చిక్కుకుపోయిన పర్యాటకులు
- జాతీయ రహదారులు సహా 170 రోడ్లు మూసివేత

**సిమ్లా:** పర్వత ప్రాంత రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా మంచు కురుస్తోంది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా మంచు వర్షం కురుస్తుండటంతో ఎక్కడ చూసినా మంచు దిబ్బలే దర్శనమిస్తున్నాయి. ఇళ్లు, రహదారులు, వాహనాలు, చెట్లపై భారీగా హిమపాతం పడుతోంది. దీంతో ఆయా ప్రాంతాలు కనుచూపుమేర శ్వేత వర్ణం అలుముకున్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మనాలీ, రాజధాని సిమ్లా సహా తదితర ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. రోడ్లపై భారీగా మంచు పేరుకుపోయింది. దీంతో స్థానిక ప్రజలు, పర్యాటకులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన మంచు పరిస్థితుల దృష్ట్యా మూడు జాతీయ రహదారులు సహా 174 రోడ్లను మూసివేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. విపరీతమైన మంచు కారణంగా రోహతంగ్‌లోని సొలాంగ్-అటల్ టన్నెల్ మధ్య సోమవారం రాత్రి దాదాపు వెయ్యికి పైగా వాహనాలు చిక్కుకుపోయాయి. దీంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. 700 మందికిపైగా పర్యాటకులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా, ఏటా క్రిస్మస్, నూతన సంవత్సరం నేపథ్యంలో డిసెంబర్ చివరి వారంలో మనాలీ, సిమ్లాకు పర్యాటకులు పోటెత్తుతుంటారు. గత కొద్ది రోజులుగా వేల సంఖ్యలో వాహనాలు మనాలీ, సిమ్లాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

### ఆర్థిక నిపుణులతో ప్రధాని భేటీ

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. బడ్జెట్‌కు సంబంధించి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక వేత్తలు, నిపుణులతో సమావేశమయ్యారు. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. కాగా, ఈ సమావేశంలో సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, సుర్జిత్ భల్లా, డీకే జోషి సహా ప్రముఖ ఆర్థిక వేత్తలు సమావేశానికి హాజరయ్యారు. ఇదిలాఉండగా, భారతదేశ 2024-25 ఆర్థిక వృద్ధి మందగమనం నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. సెప్టెంబరు త్రైమాసికంలో భారత ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి పడిపోయింది. దాదాపు రెండేళ్ల కనిష్ఠానికి చేరింది. జీడీపీ భారీ తగ్గుదల నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6 శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని అంచనా వేయగా... వాటి కంటే తక్కువగా పడిపోవడం గమనార్హం. జీడీపీ 7 శాతం పెరుగుతుందని రిజర్వు బ్యాంకు అంచనా వేయగా... అంచనాలకు మంచి జీడీపీ పతనమైంది. రాబోయే బడ్జెట్‌లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటిస్తుందా? లేదంటే సంస్కరణలు తీసుకువస్తుందా? అనే విషయంపై ఆసక్తి నెలకొంది. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల ట్రంప్ భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతర దేశాల వస్తువులపై సుంకాలను పెంచనున్నట్లు హెచ్చరించారు. మరో వైపు ఈనెల 20న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో ఆర్థిక మంత్రి ప్రీ-బడ్జెట్ సమావేశం నిర్వహించారు. పంజాబ్, కేరళ సహా అనేక రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు కేంద్రం నుంచి ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. దీర్ఘకాలిక మౌలిక సదుపాయాలు, మూల ధనం వ్యయం కోసం 50 సంవత్సరాల వడ్డీ లేని రుణాల కేటాయింపును పెంచాలని కేంద్రాన్ని కోరారు.

# వందే భారత్ స్లీపర్ ట్రయల్ రన్ విజయవంతం

**గ్వాలియర్:** వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రయాణికుల రైలును విజయవంతంగా పరీక్షించారు. మధ్య ప్రదేశ్‌లోని ఖజురహో-ఉత్తర ప్రదేశ్‌లోని మహోబా రైల్వే స్టేషన్ల మధ్య రెండు రోజులపాటు ట్రయల్ రన్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం చెన్నై ఐసీఎఫ్ నుంచి ఖజురహో చేరిన ఈ రైలు శనివారం అక్కడి నుంచి మహోబాకు చేరకుంది. మరుసటి రోజు ఖజురహో నుంచి తిరిగి మహోబాకు వచ్చింది. ఎస్ఆర్‌డీవో అధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్ రన్‌లో రైల్వే సాంకేతిక బృందంతో పాటు ఐసీఎఫ్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖజురహో వెళుతున్న సమయంలో గంటకు 115 కిలోమీటర్ల వేగంతో దూసుకువెళ్లిన రైలు... తిరుగు ప్రయాణంలో 130 కి.మీ. వేగంతో నడిచింది.

ఈ సందర్భంగా అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించారు. అయితే వందేభారత్ రైలును గంటకు 160 నుంచి 200 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా తయారుచేశారు. ఈ రైలును వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి తీసుకురావాలని భారత రైల్వే భావిస్తోంది. దీనికోసం 10 రైళ్లను సిద్ధం చేస్తున్నది. వందే భారత్ స్లీపర్ రైలుకు చాలానే ప్రత్యేకలున్నాయి. విమానం తరహాలో ప్రయాణికులకు సౌకర్యాలుంటాయి. ఈ రైలులో ఒకేసారి 823 మంది ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఫస్ట్ ఏసీ కోచ్, నాలుగు సెకండ్ ఏసీ, 11 థర్డ్ ఏసీ కోచ్‌లు ఉంటాయి. కాగా, ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించడం వల్ల సమయం గణనీయంగా తగ్గనున్నది. రైలులో ఫైర్ సేఫ్టీతో పాటు ప్రతి బెర్త్ వద్ద అత్యవసర స్టాప్ బటన్స్ సైతం ఉంటాయి. బెర్తులను మెరుగైన కుషన్‌తో, అప్పర్ బెర్తులు ఎక్కేలా మెట్లు ఏర్పాటు చేశారు. అలాగే, బయో వాక్యూమ్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. టాయిలెట్‌లో ఎలాంటి బటన్ నొక్కకుండానే నీళ్లు వస్తాయి. ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి వెళ్లేందుకు ఆటో మేటిక్ డోర్లు ఏర్పాటు చేశారు. ప్రతి కోచ్‌లో ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్ సైతం ఉంటుంది. ప్రతి కోచ్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. చార్జింగ్ పెట్టుకునేందుకు ప్రతి బెర్త్ వద్ద సాకెట్ ఉంటుంది. అలాగే, బెర్త్ వద్ద చిన్న లైట్ సైతం ఉంటుంది. సేఫ్టీ 'కవచ్' సిస్టమ్, బ్లాట్ ప్రూఫ్ బ్యాటరీ, 3 గంటల ఎమర్జెన్సీ బ్యాకప్ ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తాయని రైల్వే శాఖ పేర్కొంది.

# విశాలాంధ్ర హైదరాబాద్

## క్రిస్మస్‌ను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : యేసుక్రీస్తు జన్మదినోత్సవమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ జన్మదినాన్నీ క్రైస్తవులు జరుపుకొనే క్రిస్మస్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ఎంతో పవిత్రంగా భావిస్తారని కలెక్టరు అన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం, శత్రువుల పట్ల సైతం క్షమా గుణం కలిగి ఉండటమే యేసుక్రీస్తు అందరికి ప్రబోధించారని దీనిని అనుసరించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కలెక్టరు మల్కాజిగిరి జిల్లా ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## విశాలాంధ్ర నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్‌నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో మంగళవారం విశాలాంధ్ర జాతీయ తెలుగు దినపత్రిక విలేకరులు ఎండి ఫెరోస్, నూరుద్దీన్, ఎండి.ఇలియాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్ నగర్ ఎమ్మెల్యే, రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరై 2025 విశాలాంధ్ర జాతీయ తెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటు పేద ప్రజలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక పత్రిక విశాలాంధ్ర జాతీయ తెలుగు దినపత్రిక అని కొనియాడారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని ఆకాంక్షించారు. అనంతరం 73 సంవత్సరాల విశాలాంధ్ర జాతీయ తెలుగు దినపత్రిక చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ప్రజల పక్షాన నిలిచిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, బాలరాజ్ గౌడ్, హరినాథ్ రెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి, ఇబ్రహీం, బస్వం, ముబారక్, ఖదీర్, అన్వర్, అలీం, ఆంజనేయులు, రాజు, సత్తయ్య, అశోక్, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్లకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు వచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి 31 వరకు బస్సు యాత్ర కొనసాగుతుందని సీఐటీయూ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా నాయకులు, సిఐటి మల్కాజిగిరి మండల కార్యదర్శి బి.నర్సింగ రావు తెలియజేశారు. బస్సు యాత్ర సంబంధించి వాల్ పోస్టర్‌ను మల్కాగిజిరి చౌరస్తాలో విడుదల సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షురాలు ఏ.హేమలత మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆశలకి ఇచ్చిన వాగ్దానాన్ని రూ.18 వేల ఫిక్స్ వేతనాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఆశావర్కర్స్‌కు వర్తింపజేయాలని, గౌరవ వేతనం కాకుండా ఫిక్స్ వేతనం నిర్ణయించి అమలు చేయాలని, పారితోషకాలు లేని పనులను ఆశ వర్కర్స్‌తో చేయించకూడదని, పెండింగ్ బిల్స్ వెంటనే విడుదల చేయాలని, ఆశ వర్కర్లకు ఏఎన్ఎంగా పదోన్నతులు కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వసంత, హేమలత, ఆశాలత, రాజ్యలక్ష్మి, సుమలత, శశికళ నమ్రత, సుజాత తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## చిన్నారికి పాలమూరు రెడ్డి సేవసమితి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి పాలమూరు రెడ్డి సేవ సమితి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మహబూబ్ నగర్ జిల్లా కౌకుంట్ల మండలం దాసర్పల్లి గ్రామ వాసి శ్రీకాంత్ రెడ్డి అశ్విని దంపతుల కూతురు బేబీ తేజస్విని రెడ్డి అనే 9 నెలల పాప పొరపాటున టర్పెంటైన్ ఆయిల్ తాగడం జరిగింది. ఈ పాపకు ప్రాణాపాయ స్థితిలో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఊపిరితిత్తులకు ఎక్మో చికిత్స కోసం దాదాపు రూ. 20 లక్షలు ఖర్చవుతోంది. వీరికి పాలమూరు రెడ్డి సేవా సమితి దాతల ద్వారా సేకరించిన డబ్బులు మరియు స్వంత నిధుల నుండి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.2,50,000 చెక్కును పాప తండ్రి రాంపురం శ్రీకాంత్ రెడ్డికి అందజేశారు.

**తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం...**

తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన ఏ.పి. జితేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుని మహబూబ్ నగర్‌లోని వారి నివాసంలో పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తగిన శిక్షణ ఇచ్చి వారిని క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు. సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనా రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నరసింహా రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రామ రెడ్డి, ప్రచార కార్యదర్శి నల్లమద్ది సురేందర్ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, దాసరపల్లి వాస్తవ్యులు శ్రీరామ్ రెడ్డి పాల్గొన్నారు.

## పోకో నుండి ఎం7 ప్రో - సి75

విశాలాంధ్ర - హైదరాబాద్ : పోకో మొబైల్ సంస్థ తన నూతన ఎం7ప్రో, సి 75 ను ఆవిష్కరించింది. ఇది ప్రకాశవంతమైన ఏఎంఓ ఎల్ ఈడీ డిస్ప్లే కలిగి ఉండడంతో పాటు వాటి సంబంధిత విభాగాలలో అద్భుతమైన ఫీచర్లతో రూపొందించబడిన ఈ పరికరాలు డిస్ప్లే ప్రకాశం, పనితీరు సామర్థ్యంలను మెరుగుపరిచాయని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే లీనమయ్యే ఆడియో, ఫ్లాగ్‌షిప్-గ్రేడ్ కెమెరాలతో మిడ్-రేంజ్ కేటగిరీని పునర్నిర్మించే ఒక పవర్‌హౌస్ కూడా ఉన్నట్లు పేర్కొంది. అలాగే సి75 5+ మాత్రమే సోనీ సెన్సార్‌తో వస్తున్న అత్యంత సరసమైన 5+ స్మార్ట్‌ఫోన్‌గా వెల్లడించింది. ఈ ఆవిష్కరణలతో పోకో అభిమానులకు మరిన్ని ఆవిష్కరణలు మరింత విలువను అందించాలనే దాని లక్ష్యానికి కట్టుబడి ఉంటుందన్నారు.

# కొత్త ఏడాదిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం షురూ

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలో ఏరాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణలో వచ్చే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లను నిర్మిస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో గృహనిర్మాణాలకు సంబంధించి మంగళవారం ఆయన హియాయత్‌నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పర్యవేక్షించేందుకుగాను రాష్ట్రంలోని 33 జిల్లాలకు 33 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి కలిగిన ప్రాజెక్ట్ డైరెక్టర్లను నియమించామన్నారు. ఏటా నాలుగున్నర లక్షల చొప్పున వచ్చే నాలుగేళ్లలో 20 లక్షలకు తక్కువ కాకుండా అత్యంత నిరుపేదలకు ఇండ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈనెల 23తేదీ నాటికి సుమారు 32 లక్షల దరఖాస్తులను పరిశీలించడం జరిగిందన్నారు. రోజుకు నాలుగున్నర నుంచి ఐదున్నర లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని జనవరి మొదటి వారంలో ఇందిరమ్మ ఇండ్లకోసం వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తవుతుందని తెలిపారు. ఆ తర్వాత లబ్దిదారుల ఎంపిక పూర్తిచేసి సంక్రాంతి నాటికి ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. హౌసింగ్ కార్పొరేషన్ బలోపేతం చేస్తున్నామని గత ప్రభుత్వం ఈ విభాగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. వివిధ విభాగాలలో పనిచేస్తున్న 95శాతం కార్పొరేషన్ ఉద్యోగులను వెనక్కి తీసుకురావడం జరిగిందని వివరించారు. ఈ ఏడాది నాలుగున్నర లక్షల ఇండ్ల నిర్మాణమే కాకుండా 20 లక్షల ఇండ్లు నిర్మించడానికి అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ. మొదటి విడతలో వికలాంగులు, వితంతువులు వంటి వారికి అవకాశం ఇస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిబంధనల మేరకు కొంతమందిని తిరస్కరించినా రాష్ట్ర ప్రభుత్వం తరపున వారికి ఇండ్లు ఇస్తామని చెపుకొచ్చారు. కేంద్రం విధించే నిబంధనలను ఆమోదిస్తూ కేంద్ర నిధులను తీసుకుంటామని చెప్పారు. తలతాకట్టుపెట్టయినా ఇండ్లు నిర్మిస్తాం, దీనికి సంబంధించి సిఎం రేవంత్ రెడ్డి పేషి మొదలు కొని నా పేషీ, ముఖ్యఅధికారుల కార్యాలయాలలో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గాను ప్రత్యేక విధివిధానాలు ప్రకటిస్తామని, వారంరోజులు లోగా ప్రత్యేక ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రత్యేక వెబ్‌సైట్, టోల్ ఫ్రీ నెంబర్లు ఇస్తామని, రాష్ట్రంలోని ఏ మారుమూల తండా, లేదా గ్రామం నుంచైనా ఫిర్యాదు చేస్తే తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీలు లబ్దిదారులను ఎంపికచేస్తాయని, ఈ నేపధ్యంలో ఏ అధికారి తప్పుచేసినా గట్టిచర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ నలువైపులా వందేసి ఎకరాలను సమీకరించి హౌసింగ్ బోర్డు ఆధ్వర్యాన ఇండ్ల నిర్మాణం చేపడతామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బుద్ధ ప్రకాష్, ఎండీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని తరగతులు జరిగేలా చూడాలి: మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాఠశాల సగం మంది ఉపాధ్యాయులు సమ్మెలో ఉండగా విధుల్లో ఉన్న వారు అన్ని తరగతులు జరిగేలా చూడాలని ఉపాధ్యాయులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం హుస్నాబాద్ నియోజకవర్గం చిగురు మామిడి మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను మంత్రి సందర్శించారు. కేజీబీవి ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో విద్యార్థులు ఎదుర్కుంటున్న సమస్యలపై ఆయన నేరుగా మాట్లాడారు. ఇప్పటికే పూర్తైన పాఠాలను చదవడంతో పాటు ప్రాక్టీస్ చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల పరీక్షలు సమీపిస్తుండటం, ఇంకా సిలబస్ పూర్తి కాకపోవడం దృష్ట్యా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె విరమించాలన మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని తక్షణమే సమ్మె విరమించి విధుల్లోకి హాజరుకావాలని కేజీబీవీ సమ్మె చేస్తున్న రాష్ట్ర నాయకులతో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో ప్రతి తరగతిలో విద్యార్థినులతో ముచ్చటించారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిన తరువాత అందుతున్న ఆహారం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందుతుందని మెనూ ప్రకారం కూరలు, ఇతర ఆహార పదార్థాలు అందుతున్నాయని విద్యార్థులు తెలిపారు. పాఠశాల వంటగదిని పరిశీలించిన ఆయన విద్యార్థులకు మధ్యాహ్నం వండిన వంటలు అన్నం, కూరలను పరిశీలించారు. అక్కడే ఉన్న కూరగాయలను పరిశీలించారు. అనంతరం కేజీబీవీ స్కూల్ పరిసరాలను పరిశీలించి స్కూల్ గ్రౌండ్ ఆవరణలో బుష్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో మునగ, జామ, నిమ్మ, కరివేపాకు తదితర ఉపయోగపడే మొక్కలు నాటాలని సూచించారు. ప్రహరీ గోడ వద్ద ఉన్న పిచ్చి చెట్లు తొలగించి శుభ్రం చేయాలని అధికారులను సూచించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్, ఓల్డ్ మల్కాజిగిరి, సీతారాం నగర్, కృపా కాంప్లెక్స్, చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సాయిరాం 43,500 (కృపా కాంప్లెక్స్), లక్ష్మీనరసమ్మ 44,000 (ఓల్డ్ మల్కాజ్గిరి), ప్రణయ్ సాగర్ 15,500 (సీతారాంనగర్), రూపాయల, చెక్కులు మంజూరు కాగా మంగళవారం శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి బోయిన్ పల్లి క్యాంప్ ఆఫీసులో బాధితులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సంక్షేమ సహాయనిది పేదలు అనారోగ్యానికి గురైన సమయంలో వారికి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నీలం సతీష్, జనార్ధన్, కోటేశ్వర్, రాజు పాల్గొన్నారు.

**వైద్య చికిత్సకై ఎల్.ఓ.సి అందజేసిన ఎమ్మెల్యే మర్రి**

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గౌతమ్‌నగర్ డివిజన్‌ను చెందిన వసుంధర, బాల నరసింహులు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య చికిత్స నిమిత్తం దరఖాస్తు చేసుకోగా మంజూరైన ఎల్ఓసి పత్రాన్నివసుంధరకు 21,500, బాల నర్సింహులుకు 38,000 వేల చెక్కులను బోయిన్పల్లి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నాయకులు మేకల రాము యాదవ్, బిఆర్ఎస్ నాయకులు బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పైన అనుచితమైన వ్యాఖ్యలు చేసినందుకు గాను ఎఐసిసి ఇచ్చిన పిలుపు మేరకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు జరిగింది. నడుచుకుంటూ ర్యాలీగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పైన అనుచితమైన వ్యాఖ్యలు చేసిన హెూంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని, దేశానికి ఆయన క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావుకి ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మెమోరాండం ఇచ్చారు. మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధికి మాజీ ఎంపి స్వర్గీయ మల్లికార్జున్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మల్లికార్జున్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పద్మావతి కాలనీలో వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన రైల్వే శాఖ సహాయ మంత్రిగా మన మహబూబ్ నగర్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేశారని వారి సేవలను కొనియాడారు. ఎఐసిసి సభ్యులు వంశీచంద్ రెడ్డి, మహబూబ్‌నగర్ డిసిసి అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సిజె బెనహర్, ఆజ్మత్ అలి, ఏర్పుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్ బెనగల్ మృతికి కేసీఆర్ సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతీయ సినీమా దర్శక దిగ్గజం, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మ భూషణ్ శ్యామ్ బెనగల్ మరణం పట్ల బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. విస్మరించబడిన మనుషుల సామాజిక నేపథ్యాలకు సినీమా రంగంలో సమాంతర స్థానం కల్పించి, సామాన్యుల జీవన ఇతివృత్తాలకు వెండితెర గౌరవం కల్పించిన గొప్ప దర్శకుడని, భరత మాత కన్న తెలంగాణ ముద్దు బిడ్డ శ్యామ్ బెనగల్ (బెనగల్ల శ్యామ్ సుందర్‌రావు) అని కొనియాడారు. ఇటు తెలంగాణ జీవన నేపథ్యాన్ని, అటు దేశీయ సామాజిక సంస్కృతిక వైవిధ్యాన్ని ఇరుసుగా చేసుకుని, ఆలోచింపచేసేవిధంగా దృశ్యమానం చేస్తూ, డాక్యుమెంటరీలు సినిమాల రూపంలో వారందించిన సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. హైదరాబాద్ గడ్డ మీద పుట్టిన బిడ్డగా చలనచిత్ర రంగంలో తన కృషితో ప్రతిష్టాత్మక అవార్డులు సాధించి, భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్ బెనగల్ తెలంగాణకు గర్వకారణం అని అన్నారు.

## అమిత్‌షాను బర్తరఫ్ చేయాల్సిందే : వీఎస్ బోస్

విశాలాంధ్ర - కాప్రా : రాజ్యాంగ నిర్మాత, మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ కాప్రా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద ప్లకార్డులు చేతబూని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచే విధంగా అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తూ ప్రధాని మోదీ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. భరత జాతికి మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకుల భావజాలాన్ని అమిత్ షా బయటపెట్టారని తెలిపారు. రాజ్యాంగాన్ని గౌరవించటం కాషాయవాదులకు ముమ్మాటికీ ఇష్టంలేదని, మనుస్మృతి ఆధారంగా రాజ్యాంగం ఉండాలని ఆకాంక్షిస్తున్నారని, కమలనాథులు అధికారంలోకి రావటంతో సాక్షాత్తు పార్లమెంటులో అంబేద్కర్ ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లౌకికవాదులు దీనిపై స్పందించాలని కోరారు. బడుగు బలహీనవర్గాలు, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించిన రాజ్యాంగం ముసాయిదా కమిటీ చైర్మన్‌గా అంబేద్కర్ను నియమించారని గుర్తు చేశారు. మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అంబేద్కర్‌ను న్యాయశాఖమంత్రిగా నియమించుకుని పారిపాలన చేశారని తెలిపారు. దేశప్రజల హృదయాల్లో అంబేద్కర్ సజీవంగా ఉండటాన్ని సహించలేని ఆర్ఎస్ఎస్. విశ్వ హిందూ పరిషత్ ఆలోచనలతో పని చేస్తున్న బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను అవమానించిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని మతానికి, దేవుళ్లకు ముడిపెట్టడం సరికాదన్నారు. లౌకిక, ప్రజాస్వామ్యశక్తులు స్పందించాలని కోరారు. సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, శ్రీనివాస్, ఏఐటీయూసీ నేత జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సౌమ్యంగా మాట్లాడుతూ వివరాలు సేకరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో సౌమ్యంగా ప్రశాంతంగా మాట్లాడుతూ సంబంధిత డాక్యుమెంట్ల వివరాలను సేకరించాలని సర్వే నిర్వహిస్తున్న అధికారులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ఆదేశించారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, లింగాపూర్ తండాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా నమోదు ప్రక్రియను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు సర్వే నిర్వహిస్తున్న అధికారులు దరఖాస్తుదారులతో సౌమ్యంగా, ప్రశాంతంగా మాట్లాడుతూ వారి వివరాలను సేకరించాలని, సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టరు అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆర్అండ్‌బి ఈఈ శ్రీనివాసమూర్తి, తహసీల్దారు నర్సింహారెడ్డి, ఎంపిడిఓ వత్సలా దేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టీఆర్ భవన్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎన్‌టిఆర్ భవన్‌లో సెమిక్రిస్మస్ వేడుకలను తెలంగాణ తెలుగుదేశం పార్టీ మంగళవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు పోలంపల్లి అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బిషప్‌లు, పాస్టర్లు పవిత్రమైన బైబిల్‌లోని వాఖ్యాలను చదివి, వినిపించి దేవుని ఆశీర్వాదం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి అలాగే రెండు తెలుగు రాష్ట్రాలలోని నాయకులకు, కార్యకర్తలకు ఉండాలని ప్రార్థించారు. కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. బిషప్‌లు ఎం.శామ్యూల్, వీరాజి పి.ఇజ్రాయల్, డి.సురేష్‌బాబు, రెవరెండ్ పి.మోసెస్, రాయల్ ప్రభాకర్, వినోద్ కుమార్ కొప్పరపు, పాస్టర్లు కె.క్రిస్టోఫర్, కరుణాకర్, సిస్టర్ సరోజ తదితరులు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ ఇవి పవిత్రమై రోజులు అని అన్నారు. మనుషులలో పాప భీతి రావాలని, అది రావాలంటే ఏసుక్రీస్తును స్మరించుకోవాలని అన్నారు. జనక మహారాజు ప్రజల వద్దకు వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకుని పరిష్కరించేవారని అన్నారు. అందుకే ఆయనకు జనకుడు అని పేరు వచ్చిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అంటరానితనం నిర్మూలన కార్యక్రమాన్ని మొట్టమొదటిసారిగా అమలు చేశారని అన్నారు. అలాగే సచివాలయాన్ని గ్రామాలలోకి తీసుకెళ్లిన నాయకుడు చంద్రబాబు అని, ఆయన రాజనీతజ్ఞుడు అని అన్నారు. అందరూ సమానమని, నా ఇజం హ్యూమనిజమని చెప్పిన మహానేత ఎన్‌టిఆర్ అని అన్నారు. తెలుగుదేశం పార్టీ అన్ని మతాలను సమాన స్థాయిలో గౌరవిస్తుందన్నారు. భూమి మీద ఉండే సకల జీవులకు సమాన హక్కులు ఉంటాయన్నారు. ఎన్‌టిఆర్ ఆశయాలను చంద్రబాబు నాయకత్వంలో ఇక్కడ ముందుకు తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. క్రిస్మస్ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలను తెలియజేశారు. ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు, పోలంపల్లి అశోక్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను ఆనవాయితీగా ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో జరుపుకుంటూ వస్తున్నామన్నారు. రాష్ట్ర పార్టీ నాయకులు అజ్మీరా రాజునాయక్, గడ్డి పద్మావతి, షేక్ ఆరిఫ్, సూర్యదేవర లత, వేజెండ్ల కిశోర్‌బాబు, కసిరెడ్డి శేఖర్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, గూడెపు రాఘవులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ అనవాళ్లు కాపాడుకోవాలి

విశాలాంధ్ర - మణికొండ : నార్సింగి మండలం, మంచిరేవులలో చాళుక్య, కాకతీయ అనవాళ్లు ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా, సీఈవో, డా.ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. టీ.జీ.ఎస్.పి ప్రాంగణానికి ఎడమవైపున, మూసీ నది కుడివైపున వీరభద్రాలయంలో ఉన్న శివలింగం 8వ శతాబ్దం చాళుక్యుల కాలానికి చెందిందని, ఆలయం వెలుపల ఉత్తరం వైపు గల భిన్నమైన వీరభద్రుని విగ్రహం 13వ శతాబ్ది కాకతీయుల కాలం నాటిదన్నారు. మచిరేవుల పరిసరాలలో చారిత్రక ఆనవాళ్లు గుర్తించే కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ విగ్రహాలను మంగళవారం పరిశీలించారు. ఆరు చేతులు గల వీరభద్రుడు కుడివైపున కత్తి, బాణం, ఢమరుకం, ఎడమ వైపున డాలు, విల్లు, శూలం ధరించి, శరీరం అన్ని ఆభరణాలతో అలంకరించబడి ఉన్నాయన్నారు. అసంపూర్ణంగా చెక్కిన నంది శిల్పం కూడా కాకతీయుల కాలం నాటిదేనని శివనాగిరెడ్డి చెప్పారు. చారిత్రక ప్రాధాన్యత గల ఈ విగ్రహాలను భద్రపరిచి, కాపాడుకోవాలని ఆలయ వంశ పారంపర్య అర్చకులు మాడపాటి పరమేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. వారసత్వ కార్యదర్శి పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి, ఆలయ అర్చకులు మాడపాటి పరమేశ్వర్ పాల్గొన్నారు.

# వ్యవసాయ భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రధానమంత్రి కుసుమ్ కాంపోనెంట్-ఎ పథకం ద్వారా రైతుల పొలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఆదేశాలు జారీ చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ కార్యక్రమం ద్వారా రైతుల పొలాల్లో సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేసి వారికి అదనపు ఆదాయ మార్గాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ పథకం కింద 0.5 మెగావాట్ల నుండి రెండు మెగావాట్ల వరకు సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఎండిపోయిన లేదా పాడుబడిన వ్యవసాయ భూములపై ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ విధంగా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తిని చేయడంతో పాటు రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. రైతులు తమ భూమిని సోలార్ విద్యుత్ ప్లాంట్ అభివృద్ధి కోసం డెవలపర్లకు లీజుకు ఇచ్చుకోవచ్చు, ఈ సందర్భంలో భూమి యజమానికి డెవలపర్లకు మధ్య డిస్కమ్‌ల ద్వారా ఒప్పంద మేరకు లీజు మొత్తం అందించబడుతుందని తెలిపారు. రైతులు, రైతు బృందాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్లు, వాటర్ యూజర్ అసోసియేషన్లు, సైతం ఈ పథకం కింద దరఖాస్తు చేయవచ్చు అని తెలిపారు. ఈ పథకం కోసం దరఖాస్తులు టీజీఆర్ ఈడీసీఓ ద్వారా ఆన్ లైన్ లో సమర్పించాలని, లిస్టులో పేర్కొన్న సమీప సబ్ స్టేషన్ ను ఎంపిక చేసుకొని, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. డిస్కం ఉత్పత్తి చేసిన సోలార్ విద్యుత్తును రూ.3.13/కిలో వాట్ గంట ధర వద్ద 25 సంవత్సరాల పాటు కొనుగోలు చేస్తుందని తెలిపారు.

**పెండింగ్ బిల్లులు విడుదలకు ఆలోచన : భట్టి**

10 లక్షల లోపు పెండింగ్‌లో ఉన్న ప్రజా ప్రతినిధుల బిల్లుల విడుదలకు ఆలోచన చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సర్పంచులు, జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు వంటి ప్రజా ప్రతినిధులు 7 డిసెంబర్ 2023 నాటికి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు సుమారు 1,300 కోట్ల వరకు ఉన్నాయని తెలిపారు. ఇందులో 10 లక్షలు లోపు బకాయిల విలువ సుమారు 400 కోట్ల వరకు ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పడుతున్న ఇబ్బందులను సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తాను గమనించి 10 లక్షలలోపు ఉన్న బకాయిలను త్వరలో విడుదల చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు.

గత ప్రభుత్వ పెద్దలు స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులతో పనులు చేయించి బిల్లులు పెండింగ్లో పెట్టారని, వారిని వీధులపాలు చేశారని తెలిపారు. ప్రజా ప్రతినిధుల ఇబ్బందులకు కారణమైన టీఆర్ఎస్ నేతలు పెండింగ్ బిల్లుల కోసం రోడ్లపైకి వస్తాం, ధర్నాలు చేస్తామని ప్రకటనలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధుల పెండింగ్ బిల్లుల గురించి బీఆర్ఎస్ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అన్నారు.

## యుద్ధప్రాతిపదికన మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు : మంత్రి పొంగులేటి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** వరద ముంపునుంచి ఖమ్మం ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు గాను చేపట్టిన మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు సచివాలయంలో రిటైనింగ్ వాల్ పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇఎన్సీ అనిల్ కుమార్ తదతరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మున్నేరు ముంపు నుంచి ఖమ్మం పట్టణాన్ని కాపాడేందుకు నదికి ఇరువైపులా ఆర్ సిసి కాంక్రీట్ గోడలు నిర్మిస్తున్నామని, ఖమ్మం నగరంలో ముంపునకు అవకాశం లేకుండా సరైన మార్గంలో వరద ప్రవాహాన్ని నడిపించేందుకు సరైన డిజైన్‌తో వాల్ నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ వాల్ నిర్మాణానికి అవసరమయ్యే భూ సేకరణను చేపట్టాలని, రెండు, మూడు రోజుల్లో ఖమ్మం జిల్లాలోని అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. వాల్ నిర్మాణానికి ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. 1969 నుంచి 2024 సెప్టెంబర్ వరకు వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకొని వాల్ నిర్మించాలన్నారు. ఇటు ఖమ్మం అటు పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు సౌకర్యం కల్పించేలా సుమారు 23 కిలోమీటర్ల మేర వాల్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.

## ఘనంగా అబ్దుల్ మాలిక్ మెమోరియల్ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు

**విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్యారడైస్ కాలనీలోని అబ్దుల్ మాలిక్ మెమోరియల్ స్కూల్ ఆవరణలో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో స్కూల్ అన్యువల్ స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు వివిధ రకాల ఆటోల పోటీల కార్యమాలను నిర్వహించారు. అబ్దుల్ మలిక్ మెమోరియల్ స్కూల్ చైర్మన్ సయ్యద్ ఇబ్రహీం, స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ మన్నాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి ఒక మార్గంగా పరిగణించబడుతాయని కానీ అది అంతకు మించినది నేడు విద్యార్థుల మొత్తం ఎదుగుదలకు అభివృద్ధికి క్రీడలు చాలా అవసరమని వివిధ క్రీడలు ఆడటం వలన నాయకత్వం, క్రమశిక్షణ జవాబుదారీతనం, సహనం ఆత్మవిశ్వాసం వంటి జీవిత నైపుణ్యాలను నేర్పించడంలో వారికి సహాయపడుతుందని, అదేవిదంగా జీవిత సవాళ్లను ఎదుర్కొనేందుకు వారిని సిద్ధం చేస్తుందని అన్నారు. క్రీడలు విద్యార్థులకు చిన్న వయస్సు నుండే బలమైన మానసిక,శారీరక పునాదిని అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి అని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆధ్యాత్మిక బోధన చాలా ముఖ్యమన్నారు. మెమోరియల్ స్కూల్ విదర్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ ఉపాధ్యాయునులు విద్యార్థుల తల్లిదండ్రులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహనా కల్పించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహన్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమంలో అయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 1986 డిసెంబర్ 24న అమలులోకి వచ్చిందని అలాగే వినియోగుదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వినియోగదారుల ఫోరమ్స్ చక్కగా పనిచేస్తున్నాయని అన్నారు. డిజిటల్ విధానం, వర్చువల్ విచారణాల ద్వారా వినియోగదారులకు సత్వర న్యాయం అందేలా సంఘాలు పనిచేయాలని సూచించారు. వినియోగదారులు ఆహర పదార్థాలు, నగలు, ఇతర ఏ వస్తువైన కొనుగోలు చేసేటప్పుడు ధర, నాణ్యతా ప్రమాణాలు తెలుసుకొని కొనుగోలు చేయాలని అన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే సత్వరమే వినయోగదారుల ఫోరమ్‌లో అర్జీ దాకాలు చేసి న్యాయ పరంగా నష్ట పరిహారం పొందాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల హక్కులు, చట్టాలపై అన్ని వినియోగదారుల సంఘాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయని అభినందించారు. అలాగే ప్రజలతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులలో కూడ వినియోగదారుల చట్టాలపై చైతన్యం కల్పించాలని అన్నారు. ముఖ్యంగా ఆహార తనిఖీలలో శాఖాధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టలని అన్నారు. వినియోగదారులు ఎక్కడకూడా నష్టపోకుండా నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని నకిలీ వస్తువుల మోసాల నుండి బయటపాడాలంటే వినియోగదారులలో చైతన్యం అవసరమని అన్నారు. అనంతరం వినియోగదారుల చట్టాలపై ఉపన్యాసం ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందచేసి అభినందించారు. డిసిఎస్ఓ రమేష్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అరుణ్ సాయి, తునికాల కొలతల అధికారి శివానంద్, ఆరోరా కళాశాల ప్రొఫెసర్ అర్జున్ రావు, వివిధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్:** డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పెట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హౌసింగ్ బోర్డ్, విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసితో పాటు పలు విభాగాల అధికారులు, నియోజకవర్గంలోని దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్ పల్లి, బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల లబ్దిదారులతో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చి వారు ఆత్మగౌరవంతో బ్రతకాలనే ఆలోచనతో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ విశాలవంతమైన గదులతో కూడిన ఇండ్లను నిర్మించి ఇచ్చారన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు త్రాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం, రోడ్లతోపాటు ఇతర మౌలిక వసతుల పనులను వెంటనే పూర్తి చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంతోషంగా వారికి కేటాయించిన ఇళ్లలో నివాసం ఉండేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాన్ని కల్పించడంతోపాటు మౌలిక వసతులను పూర్తి చేస్తామన్నారు. కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల విజయ శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ ఎల్లకంటి శ్రీను, నల్తూరి కృష్ణ, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ యాదవ్, హౌసింగ్ బోర్డ్ ఇంజనీరింగ్ ఈఈ పీవీ. రవీందర్, డిఈలు మారుతి, నరసయ్య, విద్యుత్ శాఖ డిఈఈ సత్తెమ్మ, ఏఈ సిహెచ్. రమేష్, జిహెచ్ఎంసి ఈఈ లక్ష్మీ గణేష్, డిఈ పాపమ్మ, దుండిగల్ ఏఈ సురేందర్ నాయక్ పాల్గొన్నారు.

## కాప్రా రెవిన్యూ ఇన్స్పెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నాం

**విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి :** ప్రభుత్వ భూములను పరిరక్షించే కొరకై విధి నిర్వహణలో భాగంగా సర్వే నెంబర్ 645 మరియు 646 ప్రభుత్వ భూమి దేవేందర్ నగర్, జవహర్ నగర్ మున్సిపాలిటీ పరిధి నందు గల కొత్తగా వెలసిన (3) అక్రమ కట్టడాలను ఉదయం సమయం సుమారు 12:15 మధ్యాహ్నం గంటల ప్రాంతంలో తొలగించే క్రమంలో కాప్రా రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్‌పై దుండగులు జరిపిన దాడిని ముక్త కంఠంతో తీవ్రంగా ఖండిస్తున్నామని, దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.... ఇట్టి చర్యలు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులు, ఉన్నతాధికారులు చూడాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో టిజిటిఎ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, సెక్రటరీ జనరల్ సెక్రటరీ పూల్ సింగ్, జనరల్ సెక్రటరీ పాక రమేష్, రాష్ట్ర టిజిఆర్ఎస్ఎ ప్రెసిడెంట్ రాంరెడ్డి, జనరల్ సెక్రటరీ బిక్షం, టిజిటిఎ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రాజేష్, సెక్రటరీ హసీనా ఓ ప్రకటనలో తెలిపారు.

## గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై స్పందించని రేవంత్ రెడ్డి సర్కార్

**విశాలాంధ్ర-బషీర్ బాగ్ :** తెలంగాణలోని గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థుల మరణాలకు స్పందించని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్, అల్లు అర్జున్ విషయం పైన డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ గురుకుల పాఠశాల, కాలేజీల్లో ఫుడ్ పాయిజన్‌తో చాలా మంది చనిపోతున్నా సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఎటువంటి చర్యలు తీసికొలేదని ఆరోపించారు. వారి నిర్లక్ష్యం వలన ఇప్పటి వరకూ 48 వరకూ దళిత బిడ్డలు ప్రాణాలు పోయినా అసెంబ్లీలో ప్రస్తావన చేయకపోవడం దళితుల పట్ల కుల వివక్షత అని విమర్శించారు. గురుకులాల్లో అనుమాస్పద మరణాలు, ఆత్మ హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం యంత్రాంగం, ఎమ్మెల్యేలు, మంత్రులు నోరు మెదపలేదన్నారు. ఈ వన్నీ సర్కార్ హత్యాలెన్నారు. సంక్షేమ శాఖ అధికారులు పత్తా లేకుండా పోయారన్నారు. ఈ మరణాలు పైన జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ. మహిళ కమిషన్‌లు తక్షణమే తెలంగాణ లోని అన్ని గురుకులాల్లో సందర్శించి విచారణ చేయాలని దళిత విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని కృష్ణ స్వరూప్ విజ్ఞప్తి చేసారు రాష్ట్రంలో జరుగుతున్న ఈ దారుణాలను ప్రజలకు కనిపించకుండా సినీ హీరో అల్లు అర్జున్, సంధ్య థియేటర్ ఘటన ను తరుచూ ప్రస్తావన చేసి ప్రజల ద్రుష్టి మలచ్చడానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో చనిపోయిన రేవతి కుటుంబానికి ప్రభుత్వం ఎటువంటి ఆదుకొనే చర్యలు లేవన్నారు. కనీసం మృతురాలి కుటుంబం సభ్యులను కానీ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న బాలుడు శ్రీ తేజను పరామర్శించని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మొసలు కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలు రైతులు, ఆత్మ హత్యలు, దళితుల పైన దాడులు జరుగుతున్నా స్పందించకుండా కేవలం సినీ పరిశ్రమ వారిపైన రాజకీయ విమర్శలు చేస్తూ, సూపర్ సిక్స్ అమలు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి పారిపోతున్నారని కృష్ణ స్వరూప్ ధ్వజం ఎత్తారు. నేతకాని మహర్ కుల సంఘము రాష్ట్ర అధ్యక్షులు గవ్వల, శ్రీకాంత్, రామచంద్ర్, మద్దెల ప్రవీణ్ కుమార్ సుబ్బారావు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాలకు సూచనలు

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ రచనల్ని ప్రోత్సహించడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తున్నది. 2023 సంవత్సరానికి ప్రదానం చేసే పురస్కారాల ఎంపికకు పాఠకులు, రచయితల నుండి విశ్వవిద్యాలయం సూచనలు కోరుతోంది. వివిధ ప్రక్రియల్లో 2020 జనవరి నుండి 2022 డిసెంబర్ మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన గ్రంథాల్లో పాఠకులు ఉత్తమంగా భావించిన గ్రంథాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. రచయిత మరణించినప్పటికీ వారి రచనలు 2020 జనవరి నుండి 2022 డిసెంబర్ మధ్యకాలంలో ప్రచురణ పొంది ఉంటే సూచించవచ్చు. గేయ కవిత ప్రక్రియలో మాత్రం 2018 నుండి 2022 మధ్య ప్రచురణ పొందిన గ్రంథాలను సూచించవచ్చు. వచన కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, గేయ కవిత, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 11 ప్రక్రియల్లో అన్ని ప్రక్రియలకు గాని, కొన్నింటికి గాని, తమకు నచ్చిన గ్రంథాలను పురస్కారాలకు సూచించవచ్చు. సూచనలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణకర్త పేరు పేర్కొనాలి. రచయితలు కూడా తమ గ్రంథాలను స్వయంగా సూచించవచ్చు. అనువాద సాహిత్య విభాగానికి తప్ప మిగతా విభాగాలకి అవార్డులకోసం అనువాదాలు, అనుసరణలు ఆమోదింపబడవు. వచన రచన అనే ప్రక్రియలో సామాజిక, ఆర్థిక, తాత్త్విక, వైజ్ఞానిక, స్వీయ చరిత్ర, దేశ చరిత్ర, సంస్కృతి, కళలకు సంబంధించిన గ్రంథాలు సూచించవచ్చు. అన్ని ప్రక్రియల్లోనూ ప్రామాణికమైన మౌలిక గ్రంథాలనే సూచించాలి. కవితా సంపుటులయితే కనీసం 60 పేజీలు, మిగతా ప్రక్రియల్లో గ్రంథాలు 96 పేజీలకు తగ్గరాదు. బాలసాహిత్యం, నాటకం ప్రక్రియల్లో పుటల పరిమితిలేదు. రచయితలు తమ దరఖాస్తులను రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు-500004 చిరునామాకు 20 జనవరి 2025 లోగా పంపాలని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలో వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేసి ప్రతి పేదవాడికి పథకం అందేలా చూడాలని అధికారులకు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం చించోడు, దేవునిపల్లి గ్రామాల్లో ఫరూక్ నగర్ ఎంపీడీవో బన్సీలాల్ ఆధ్వర్యంలో ఇళ్లు లేని నిరుపేదలు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా సర్వే సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వేను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. లబ్దిదారుల వివరాలు ఆప్‌లో నమోదు చేస్తున్న ప్రక్రియను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. గత పది ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ల ఆశ చూపి గ్రామాల్లో ఎక్కడ ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని అన్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, సిలిండర్ పై సబ్సిడీ, ఉచిత కరెంటు, గృహాలకు కరెంటు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలను అన్ని విధాల ఆదుకునేందుకు కృతనిష్యంతో ఉందని అన్నారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నిరసన ర్యాలీ

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర కోణంలో బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అంబేద్కర్ పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలపై గల్లి నుంచి ఢిల్లీ వరకు ఏఐసిసి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టారు. హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రాహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుండి హైదరాబాద్ కలక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్‌ను అడ్రెస్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్ పేరు లక్షల, కోట్ల సారైనా నిత్యం స్మరిస్తూనే ఉంటామని చెప్పారు. అమిత్‌షాపై చర్యలు తీసుకునేంత వరకు కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. అంబేద్కర్ ప్రకార్డులను, నీలంరంగు దుస్తులను ధరించి ప్రదర్శనలో కార్యకర్తలు పాల్గొన్నారు. అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి ఆమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ మాకు దేవుడితో సమానమని, అంబేద్కర్ పేరు బీజేపీ నేతలకు ఫ్యాషన్ అయితే, మాకు మాత్రం ఆరాధ్య దైవమన్నారు. మనుస్మృతి అమలు చేసేందుకు బీజేపీ, సంఘ్ పరివార్ కుట్ర అని, తక్షణమే అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలన్నారు. ప్రజావ్యతిరేకతను గమనించి ఇప్పటికైనా ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి బీజేపీపై పెద్దఎత్తున కాంగ్రెస్ పోరాడుతోందని స్పష్టం చేశారు. ఎంపి.అనిల్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, జాతీయ నాయకుడు కొప్పుల రాజు, డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి, సమీరుల్లా తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు అధికారుల క్రిస్మస్ శుభాకాంక్షలు

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలకు క్రిస్మస్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ విశ్వ ప్రేమ, శాంతి, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పండుగ యేసు క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా జరుపుకుంటామని, ప్రజలందరూ ఆనందం, శాంతి, సుఖశాంతులతో నిండిన జీవనాన్ని గడపాలని మేయర్ ఆకాంక్షించారు. క్రిస్మస్ సమాజంలో సామరస్యాన్ని, సహనాన్ని, సేవా స్ఫూర్తిని మరింత పెంపొందించాలనీ ఆమె కోరారు. నగరంలో క్రిస్ మాస్ వేడుకలు ఘనంగా ఆనందోత్సవాలతో జరుపుకునేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు మేయర్ తెలిపారు

**కమిషనర్ శుభాకాంక్షలు..**

జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం మరియు మానవత్వం సందేశాలను చాటే పవిత్రమైన పండుగగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ క్రిస్మస్ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి మరియు ఆనందం నింపాలని ఆయన ఆకాంక్షించారు.

సామరస్యం, స్నేహభావంతో క్రిస్మస్ పండుగ అన్ని మతాలకు చెందిన ప్రజలు కలిసి ఆనందంగా జరుపుకునే సంబరమని, ఇది సామాజిక సమగ్రతకు ప్రాముఖ్యతను చాటుతుందన్నారు. కమిషనర్ ఈ సందర్భంగా నగర ప్రజలను హైజీన్ మరియు క్లీన్లీనెస్ మీద దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అందరి సహకారంతో నగరాన్ని శుభ్రంగా ఉంచి, సమర్థవంతమైన అభివృద్ధికి దోహదం చేయాలనీ కోరారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా జిహెచ్ఎంసి నగర ప్రజ్లకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## డ్రైనేజీ, సిసి రోడ్లు పనులకు శంకుస్థాపన

**విశాలాంధ్ర - మేడిపల్లి:** పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లు 7, 9, 10, 21, 24 వార్డ్ లలో రూ. 2కోట్ల 36 లక్షల నిధులతో డ్రైనేజీ, సిసి రోడ్లు పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ ను తెలంగాణ రాష్ట్రంలోనే నెంబర్ వన్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతానని, అన్ని డివిజన్ లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ డివిజన్‌లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావు, డి.ఈ. సాయినాథ్ గౌడ్, పలు డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు సీనియర్ నాయకులు, మహిళ నాయకురాలు, డివిజన్ల సీనియర్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమ పథకాలకు ప్రభుత్వం తూట్లు :: ఎమ్మెల్సీ కవిత



**విశాలాంధ్ర - హైదరాబాద్ :** కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని, హామీల అమలు కోసం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా బీసీలకు ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనను ఎగవేసే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మంగళవారం నాడు తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు, విశ్వకర్మ కుల సంఘాల నాయకులు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. తమకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ బీసీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులను కుదేలు చేస్తున్నదని విమర్శించారు. కుల వృత్తుల వారికి ప్రభుత్వం కనీస మద్దతు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యధికంగా బీసీ విద్యార్థులు లబ్ధిపొందే ఫీజు రియింబర్స్‌మెంట్, పూలే స్కాలర్ షిప్ పథకాల నిధుల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బీసీల కోసం అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని, ఇప్పటి వరకు బీసీ సంక్షేమానికి ఎంత ఖర్చు చేశారని చెప్పాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు బొల్లా శివ శంకర్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు కొట్టాల యాదగిరి ముదిరాజ్, దాసరి నరేష్ ముదిరాజ్, నాగభూషణం ముదిరాజ్, భిక్షపతి ముదిరాజ్, విశ్వనాథుల పుష్పగిరి, జాతీయ సహాయ కార్యదర్శి చొల్లేటి ప్రభాకర్, అబ్బోజు రామ్ సుధాకరాచారి, హేమ జిల్లోజు, స్థపతి, యూత్ వింగ్ కార్యదర్శి నరేష్ చారి పాల్గొన్నారు.

## సంస్కృతి, సృజనాత్మకత, ఆత్మీయతతో కూడిన తాప్సీ అందమైన ఇల్లు



**విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ :** అది ఒక అందమైన ఇల్లు. ఇల్లు అనడం కంటే అది ఒక ఇంద్రభవనం అనడం సబబు ఏమో? ఎందుకంటే, ఆ ఇంట్లో ప్రతి మూల ఎంతో అందంగా తీర్చిదిద్దబడింది. చూడటానికి రెండు కళ్లు చాలవు, అంత బాగుంటుంది. ఆ ఇంటిని చూస్తే మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ఇంతకీ ఆ ఇల్లు ఎవరిది అనే ప్రశ్నే కదా! ఆ ఇల్లు ప్రముఖ బాలీవుడ్ సినీ నటి తాప్సీది. 'ఏషియన్ పెయింట్స్ వేర్ ద హార్ట్ ఈజ్' సీజన్ 8 తాజా ఎపిసోడ్‌లో తాప్సీ పన్ను తన ముంబయి ఇంటి తలుపులు తెరిచింది. తన ప్రత్యేక ప్రపంచాన్ని చూపించారు. తెరపై ఎన్నో పాత్రలతో ప్రేక్షకుల మనస్సు దోచుకున్న ఆమె తన ఇంటిని తన వ్యక్తిత్వానికి అనుగుణంగా తీర్చిదిద్దారు. ఈ ఇల్లు ఆమె వ్యక్తిత్వాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. ముంబయిలో ఉన్న ఆ ఇంటి ప్రత్యేకతే వేరు. అది కేవలం ఒక ఇల్లే కాదు, ఆమె కుటుంబ మూలాలు, ఆత్మను ప్రతిబింబిస్తుంది. 'ఇల్లు అనేది నా కుటుంబం ఉన్న చోటు. నేను నా చెల్లితో చాలా దగ్గరగా ఉంటాను. ఆమె ఎక్కడ ఉంటే అదే నా ఇంటిగా భావిస్తాను' అని తాప్సీ చెప్పింది. తాప్సీ చిన్నప్పుడు రెండు పడక గదుల అపార్ట్‌మెంట్‌లో జీవితం గడిపేది. ఆ ఇంట్లో ఎనిమిది మంది కుటుంబ సభ్యులతో కలిసి ఉన్న రోజులు, వ్యక్తిగత స్థలానికే లోటు ఉన్నా.. ఆనందంగా ఎలా ఉండాలో నేర్పింది. ఈ అనుభవం ఆమె వ్యక్తిగత స్థలంపై ఉన్న ఆరాధనను పెంచింది. దీంతో ఏకాంతాన్ని, స్నేహబంధాల కోసం స్థలాన్ని సమతుల్యంగా కలిగించే ఇంటిని రూపకల్పన చేయడానికి ప్రేరణ ఇచ్చింది. రెండు అంతస్థులు కలిగి ఉన్న ఈ ఇల్లు ఆ దృష్టికోణాన్ని అద్భుతంగా ప్రతిఫలిస్తుంది. ఇంట్లో అడుగు పెట్టగానే తాప్సీ చలాకీతనంతో నిండిన హాస్యం మిమ్మల్ని ఆహ్వానిస్తుంది. 'యూ లుక్ నైస్ టుడే', 'ప్రిటెండ్ దిస్ ఈజ్ ఏ హవేలీ' వంటి సందేశాలతో వెల్కమ్ మ్యాట్స్, సంతోషకరమైన, సాన్నిహిత్యమైన వాతావరణాన్ని కల్పిస్తుంది. 'నా ఇల్లు నిజంగా ఒక వరల్డ్ టూర్‌లా ఉంటుంది' అని తాప్సీ చెప్తుంది. ఆమె గ్లోబల్ ట్రావెల్స్ నుంచి సేకరించిన డెకర్, కళాఖండాలను చూపిస్తూ ఈ మాటలు అన్నారు. యూరోప్ థీమ్‌తో ఉన్న కింద అంతస్తులో తన ప్రయాణాల నుంచి తెచ్చిన సావనీర్స్‌ను ఆమె ప్రేమగా 'ఏషియన్ పెయింట్స్ కి వాల్' అని పిలిచే ప్రత్యేక ఫీచర్‌పై ప్రదర్శిస్తుంది. వివిధ రంగుల్లో ఉన్న బోల్డ్ స్ట్రిప్స్‌తో అలంకరించిన ఈ గోడ కలర్ స్వాచ్ బుక్‌లాగా కనిపిస్తుంది.

# శంకరన్ నాలెడ్జ్ సెంటర్ల ఏర్పాటు హర్షణీయం

- సీఎం చంద్రబాబుకు ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ అభినందనలు
- ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లల్లోనూ ఏర్పాటు చేయాలి: జల్లి విల్సన్

**విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) :** రాష్ట్రంలోని 104 బీసీ వసతి గృహాల్లో ఎస్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించాలని, వాటిలో నైపుణ్య విద్యలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, సోషల్ ఎమోషనల్ స్కిల్స్, నైతిక విలువలు, నీతిశాస్త్రం, డిజిటల్ లిటరసి, న్యాయ అవగాహన, క్రమశిక్షణ తదితర అంశాలను ఈ సెంటర్ల ద్వారా విద్యార్థులకు బోధించడం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లివిల్సన్ అభినందనలు తెలిపారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ అధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విల్సన్ మాట్లాడుతూ దళిత, గిరిజన, పేద వర్గాలకు శంకరన్ చేసిన సేవలు నిరుపమానమన్నారు. సాంఘిక, ఆర్థిక,సామాజిక వివక్షతకు గురవుతున్న ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనారిటీ, మహిళలు వంటి అనేక వర్గాలను పరిగణనలోనికి తీసుకొని రాజ్యాంగంలో పొందుపరిచిన సంక్షేమాన్ని సమగ్రంగా విస్తరించి అమలు చేశారని కొనియాడారు. తరాలు మారినా ఆయన సేవలు సజీవంగా ఉంటాయన్నారు. ఐఏఎస్ అనే దానికి పూర్తి న్యాయం చేయటమే కాకుండా తన శిష్యులుగా మరికొంతమంది ఐఏఎస్‌ల ద్వారా తన భావాలను అమలు చేసే విధంగా తయారు చేసుకున్నారన్నారు. ప్రధానంగా దళితులు,ఆదివాసీల అభ్యున్నతికి బాటలువేసే అనేక సాహసోపేత నిర్ణయాలను తీసుకున్నారన్నారు. అస్పృశ్యత నివారణ చట్టాలు, భూ సంస్కరణల చట్టాలు, గత యూపీఏ ప్రభుత్వంలోకనీస ఉమ్మడి కార్యక్రమం (సీఎంపీ) రూపకల్పన, సంక్షేమ గురుకుల పాటశాలలు, వసతి గృహాలు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల రూపకల్పనలో ఆయన పాత్ర వెలకట్టలేనిదన్నారు. అటువంటి శంకర్ సేవలు భవిష్యత్తు తరాల వారికి తెలియాల్సిన అవసరం ఎంతైన ఉందని బీసీ వసతిగృహాల్లోనే కాకుండా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో కుడా నాలెడ్జ్ సెంటర్లను ఆయన పేరుమీద ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరికి మంచి, చెడు తెలుస్తాయని శంకరన్ జీవిత విశేషాలను పాఠ్యాంశంగా చేర్చే విధంగా అలోచన చేయాలని చంద్రబాబును కోరారు. బీసీల సంక్షేమం కోసం సోమవారం ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి జల్లి విల్సన్ ధన్యవాదాలు తెలిపారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ కార్పోరేటర్ బుట్టి రాయప్ప మాట్లాడుతూ శంకరన్ అగ్రకులంలో పుట్టినప్పటికి దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. గిరిజన, దళితులకు అటవీ, భూహక్కు చట్టాలను రూపొందించి అవి పటిష్ఠంగా అమలు అయ్యేలా కృషి చేశారన్నారు. డీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేళం భాగ్యారావు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. బాధ్యతాయుత ఐఏఎస్ అధికారులు చట్టాలను ఏ విధంగా అమలు చేయాలనే దానికి శంకరన్ భవిష్యత్తు తరం వారికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్ మాట్లాడుతూ పేదల గుండె చప్పుడైన శంకరన్ వంటి అధికారులు దేశానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బి.పి.యస్ వ్యవస్థాపక అధ్యక్షులు అన్నవరపు నాగేశ్వరరావు, బీసీ నాయకులు నమ్మిఅప్పారావు, ఎస్సీ, ఎస్టీ నాయకులు మాదిగాని గురునాథం, కేవీపీసీఎస్ నాయకుడు పరిశపోగు రాజేష్ పాల్గొని మాట్లాడారు.

## అమరావతికి రూ.11వేల కోట్ల హడ్కో రుణం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాజధాని నిర్మాణ పనుల టెండర్లు, నిధుల సేకరణ, అమరావతిలో భూములు కొనుగోలు చేసిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలను ఆహ్వానించడం వంటి పనుల్లో మంత్రి నారాయణ బిజీబిజీగా గడుపుతున్నారు. దీనిలో భాగంగా దేశ రాజధాని దిల్లీలో మంగళవారం మంత్రి నారాయణ పర్యటన కొనసాగింది. హడ్కో సీఎండీ సంజయ్ కులశ్రేష్ఠ, జిందాల్ సా ఛైర్మన్ పృథ్వీరాజ్ జిందాల్‌తో నారాయణ సమావేశమయ్యారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రుణ సమీకరణ ప్రక్రియపై హడ్కో ఛైర్మన్‌తో నారాయణ చర్చించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.11వేల కోట్ల రుణం ఇచ్చేందుకు ఇప్పటికే హడ్కో అంగీకారం తెలిపిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుపై పృథ్వీరాజ్ జిందాల్‌తోనూ మంత్రి చర్చించారు. గుంటూరు, విశాఖలో రెండు ప్లాంట్ల ఏర్పాటుకు జిందాల్ గతంలో ఆమోదం తెలిపారు. వీటికి అదనంగా రాష్ట్రంలో మరిన్ని ప్లాంట్ల ఏర్పాటుపై జిందాల్‌తో నారాయణ చర్చలు జరిపారు.

## ప్రశ్నించేతత్వం, ప్రతిఘటన మార్గంలో పయనించాలి

**విశాలాంధ్ర-విజయవాడ:** మనువాద, మతోన్మాద భూతాన్ని అంతం చేయాలంటే పెరియార్ వంటి సంస్కర్తల జీవితాల్ని ఆదర్శంగా తీసుకోవాలని, తద్వారా ప్రశ్నించే తత్వం ప్రతిఘటన మార్గంలో పయనించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య సూచించారు. నాస్తిక ఉద్యమ స్ఫూర్తి పెరియార్ రామస్వామి 51 వ వర్థంతి సందర్భంగా ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో మంగళవారం సమితి రాష్ట్ర కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. సమాజంలో మూఢ విశ్వాసాల పేరుతో సాగుతున్న రాజకీయ జోక్యం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రజల్ని చైతన్య పరుస్తూ రామస్వామి ముందుకు సాగారన్నారు. జస్టిస్ పార్టీ స్థాపించిన పెరియార్ స్ఫూర్తి నేటి ద్రావిడ ఉద్యమంలోనూ కనిపిస్తుం దన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంఘ్ పరివార్ ముసుగులో ప్రజలను మతం పేరుతో విభజిస్తోందని, వారి కనుసన్నల్లో పవన్ కల్యాణ్ లాంటి వాళ్లు ఉంటూ కాలం చెల్లిన సనాతన ధర్మాన్ని ప్రజల్లోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హేతువాద ఉద్యమ నాయకుడు మోతుకూరి అరుణ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని హేతువాద దృక్పథాన్ని ముందుకు నడిపించే వారిపై భౌతిక దాడులు, అక్రమ నిర్బంధాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్ల్ మార్క్స్, పెరియార్, అంబేద్కర్, పూలే వంటి మహనీయుల స్ఫూర్తిని ముందుకు నడిపించే బాధ్యత మనపై ఉందన్నారు. ఏఐఎస్ ఎఫ్ జాతీయ కార్యదర్శి కె శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగళ్ళ సాయి కుమార్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయమని అడిగితే జాతీయ విద్యా విధానాన్ని రుద్దుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. నాగభూషణం, యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి వి. గంగా సురేష్, ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, విజయవాడ నగర అధ్యక్షుడు రంజిత్, నాయకులు సురేష్, శ్రీలత, షణ్ముఖ ప్రియ, ప్రమోద, అభి తదితరులు పాల్గొన్నారు.

## బకాయిల విడుదల... జీవో 77 రద్దు

### విద్యార్థి సంఘాల డిమాండ్

**విశాలాంధ్ర-విజయవాడ:** ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతన బకాయిలు మొత్తం రూ.3,580 కోట్లు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. రీయింబర్స్‌మెంట్ అందక పది లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి, జీవో 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రవేశాలు, పరీక్షల సమయంలో ఇబ్బందులను ఇబ్బంది పెట్టొద్దు అని కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు లేక యజమాన్యాలు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయని నాయకులు వెల్లడించారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం వీటన్నింటిని చూస్తున్నారు తప్ప కార్యాచరణకు సిద్ధం కావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో మంగళవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ జరిగింది. పేద విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేసే జీవో 77ను రద్దు చేయాలని ఈ సందర్భంగా విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. విద్యా దీవెన, వసతి దీవెనను ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్‌గా పేర్లు మార్చారే తప్ప ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ బకాయిలు చెల్లించలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని, ఫీజులు చెల్లించలేక కళాశాలలో సర్టిఫికెట్లు ఉంచిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించలేక... ఉద్యోగానికి వెళ్లలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, వైఎస్సార్‌ఎస్‌యూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రవిచంద్ర, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఏఐఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి కుమార్, కార్తీక్, నాయకులు సాదిక్, యశ్వంత్, రంజిత్, జగదీశ్, సురేశ్, అభి, సాయి, శ్రీలత, షణ్ముఖ్ ప్రియా, ప్రమోద్ పాల్గొన్నారు.

## కళారంగానికి తీరని లోటు

### శ్యామ్ బెనగల్ మృతికి ప్రజానాట్యమండలి సంతాపం

**విశాలాంధ్ర-విజయవాడ:** దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ దర్శకులు శ్యామ్ బెనగల్ మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సంతాపం ప్రకటించింది. ఈ మేరకు మండలి సీనియర్ నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు రాష్ట్ర అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యుదయ భావజాలం కలిగిన శ్యామ్ బెనగల్ మృతి కళారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. సామాజిక ప్రయోజనంతో కూడుకున్న ఎన్నో చిత్రాలకు ఆయన పని చేశారని గుర్తుచేశారు. ప్రజానాట్యమండలి కార్యకలాపాల విషయంలో శ్యామ్ బెనగల్ సానుకూలంగా ఉండేవారని కొనియాడారు.

## 26, 27 తేదీల్లో రాష్ట్రాల ప్రతినిధులతో 'వక్ఫ్' జేపీసీ భేటీ

**న్యూదిల్లీ:** వక్ఫ్ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఈనెల 26, 27 తేదీల్లో రాష్ట్రాల ప్రతినిధులతో భేటీ కానుంది. ప్రతిపాదిత చట్టంపై వారితో చర్చించేందుకు, వారి నుంచి మౌఖిక ఆధారాల నమోదుకు ఈ సమావేశాలు జరగనున్నాయి. 26న కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రతినిధులతో, 27న ఉత్తరప్రదేశ్, ఒడిశా, దిల్లీ ప్రతినిధులతో భేటీ అయి వారి వాదనలు వినబోతోంది. ఇటీవల రాజస్థాన్, లక్నోకు చెందిన ముస్లిం ప్రతినిధులతో జేపీసీ సమావేశమైంది. రాజస్థాన్ వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మన్, లక్నో ఖ్వాజా మొయినుద్దీన్ చిస్టీ యూనివర్సిటీ మాజీ వీసీతో ప్రతిపాదిత చట్ట సవరణల్లోని ప్రతి క్లాజుపై సంప్రదింపులు జరిపినట్లు జేపీసీ ఛైర్మన్ జగదాంబికా పాల్ చెప్పారు. అంతకుముందు ఆలిండియా షియా పర్సనల్ లా బోర్డు సభ్యులతోనూ జేపీసీ భేటీ అయింది. 2025 బడ్జెట్ సమావేశాల ముగింపు నాటికి వక్ఫ్ (సవరణ) బిల్లుపై నివేదిక ఇవ్వాలంటూ జేపీసీకి లోక్‌సభ గడువు పొడిగించిన విషయం విదితమే.

## అమిత్‌షా తొలగింపే ఏకైక పరిష్కారం

### 'అంబేద్కర్' వివాదంపై జైరాం రమేశ్

**న్యూదిల్లీ:** పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవమానించడం దుమారం రేపింది. దేశవ్యాప్తంగా ఆందోళనలకు, నిరసనలకు దారితీసింది. అమిత్‌షా రాజీనామా డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. విపక్షాలతో పాటు వివిధ సంఘాలు కూడా అమెరిషా తొలగింపునకు డిమాండ్ చేశాయి. ప్రస్తుత వివాదానికి ఏకైక పరిష్కారం అమిత్‌షా తొలగింపు, ఆయన క్షమాపణలు చెప్పడమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ నొక్కిచెప్పారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఏడు రోజుల పరిణామాలను ప్రస్తావించారు. కాంగ్రెస్ 'అంబేద్కర్ సమ్మాన్ వారోత్సవం', వేర్వేరు ప్రాంతాల్లో 100కుపైగా విలేకరుల సమావేశాలు నిర్వహించడం గురించి మాట్లాడారు. 'ఈరోజు అన్ని జిల్లాల్లో సమావేశాలు జరిగాయి. రాష్ట్రపతికి సమర్పించేందుకు పత్రాన్ని సిద్ధం చేస్తున్నాం' అని చెప్పారు. రాజ్యసభలో అంబేద్కర్‌నుద్దేశించి అమిత్‌షా అవమానించడానికి ఇది ప్రతిస్పందన అని తమ పార్టీ కార్యక్రమాలనుద్దేశించి జైరాం రమేశ్ అన్నారు.

## శ్యామ్ బెనెగల్ మృతికి సురవరం సంతాపం

**విశాలాంధ్ర-హైదరాబాద్:** ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, దార్శనిక కళాకారుడు, ప్రముఖ చిత్రనిర్మాత పద్మభూషణ్ శ్యామ్ బెనెగల్ మరణం తీవ్ర విషాదాన్ని నింపిందని సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. వర్గ పోరాటాలను ప్రధానంగా చూపిస్తూ, అణగారిన వర్గాలకు గొంతు ఇచ్చిన ప్రగతిశీల కథా రచయితగా ఆయన భారతీయ సినిమాపై శాశ్వత ప్రభావాన్ని చూపారని ఒక ప్రకటనలో కొనియాడారు. తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా, సాంస్కృతిక, సామాజిక గుర్తింపు పట్ల ఆయన అంకితభావం ఎల్లప్పుడూ స్మరించుకోదగినదని అన్నారు. శ్యామ్ బెనెగల్ ప్రసిద్ధి గాంచిన తెలంగాణ సాయుధ పోరాట నాయకుడు రావి నారాయణరెడ్డి స్మారక అవార్డు గ్రహీత అని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ట్రస్ట్ తరపున ఆయన కుటుంబం, స్నేహితులు, అభిమానులకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేశారు. శ్యామ్ బెనెగల్ వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని సురవరం అన్నారు.

**ఇప్టా పునరుద్ధరణలో కీలక పాత్ర : ప్రతాప్ రెడ్డి**

ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) పునరుద్ధరణకు 1986లో జరిగిన మహాసభలో శ్యామ్ బెనెగల్ కీలక పాత్ర పోషించారని రావి నారాయణరెడ్డి స్మారక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కందిమళ్ళ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శ్యామ్ బెనెగల్‌కు రావినారాయణరెడ్డి స్మారక అవార్డును ప్రదానం చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## తెలుగు భాషాభివృద్ధే లక్ష్యం

### మండలి బుద్ధప్రసాద్

### 28 నుంచి విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్):** ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఈనెల 28,29 తేదీల్లో విజయవాడ పన్‌టౌన్‌లో ఉన్న కాకరపర్తి భావనారాయణ (కేబీఎన్) కళాశాలలో నిర్వహిస్తున్నామని మహాసభల గౌరవ అధ్యక్షులు, శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మహాసభల బ్రోచర్‌ను కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007 నుంచి ఈ మహాసభలు నిరంతరం జరుగుతున్నాయని, ప్రధానంగా తెలుగు భాషాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం, విజయవాడ కాకరపర్తి భావనారాయణ కళాశాల సంయుక్త అధ్వర్యంలో జరిగే ఈ మహాసభల్లో దాదాపు 800 మంది ప్రతినిధులు వివిధ వేదికలపై తమ అభిప్రాయాలను వెలువరించనున్నట్లు చెప్పారు. రేపటి తరం కోసం ఇప్పటి మనం వివిధ రంగాలలో ఎలాంటి మార్పులు కోరుతున్నామన్నది ఈ మహాసభల ముఖ్య చర్చనీయాంశంగా ఉంటుందన్నారు. తెలుగు భాష, సాహిత్యాలను ఆధునీకరించే లక్ష్యంగా చర్చలు సాగుతాయన్నారు. 'మార్పు' పేరుతో 500 పుటల ప్రత్యేక ప్రచురణను వెలువరిస్తున్నామన్నారు. ఈ సభలను సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ ప్రారంభిస్తారని అన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు, విశిష్ఠ అతిథిగా ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజుతో పాటు అనేక మంది పజాప్రతినిధులు, మంత్రులు, కవులు, విశ్రాంత ఐపీఎస్ అధికారులు పాల్గొంటారని బుద్ధప్రసాద్ తెలిపారు. మహాసభలు జరిగే ప్రాంగణానికి పొట్టి శ్రీరాములు సభాప్రాంగణంగా నామకరణం చేశామన్నారు. మొత్తం మూడు వేదికలకుగాను మొదటి వేదికను రామోజీరావు పేరుతో ఏర్పాటు చేశామని, దీనిపై ప్రధానంగా ప్రారంభ సభ, తెలుగు వెలుగుల సభ, శాస్త్ర సాంకేతిక సదస్సు, ప్రముఖ పత్రికా సంపాదకులు, సీనియర్ పాత్రికేయులు పాల్గొనే పత్రికలు ప్రచురణలు, ప్రసార రంగాల సదస్సు, మహిళా సదస్సు, సాంస్కృతికరంగ సదస్సు, రాజకీయ ప్రతినిధుల సదస్సు, సాహితీ సంస్థలు, ఇతర రాష్ట్రాల ప్రతినిధుల సదస్సు, సమాపన సభ జరుగుతాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై దాదాపు 175 మంది యువ కవులతో ప్రత్యేకంగా యువకలాల సమ్మేళనాలు ఏర్పాటు చేసి, పాల్గొన్న కవులకు పర్యావరణ కవి పురస్కారాలతో సత్కరిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 300 మంది విద్యార్థులు ప్రతినిధులుగా నమోదు చేసుకున్నారని, వారికి నిష్ణాతులైన 40 మంది సీనియర్ సాహితీవేత్తలు వివిధ సాహిత్యాంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసభల అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కేబీఎన్ కళాశాల సభ్యులు వి.నారాయణరావు, ప్రధాన కార్యదర్శి డా.జి.వి.పూర్ణచంద్ పాల్గొన్నారు.

## మొండి కత్తితో బైపాస్ చేస్తారా?

### అభిశంసన తీర్మానంపై ధన్కర్ వ్యాఖ్యలు

**న్యూదిల్లీ:** ప్రతిపక్షాలు తనపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడంపై రాజ్యసభ ఛైర్మన్ , ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ బహిరంగంగా స్పందించారు. ప్రతిపక్షాల చర్య సరైంది కాదన్నారు. బైపాస్ శస్త్రచికిత్స కోసం కూరగాయలు కోసే కత్తిని ఉపయోగించకూడదు కదా అంటూ వ్యంగ్య వ్యాఖ్యానం చేశారు. 'ఉపరాష్ట్రపతికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన ఆ తీర్మానాన్ని చూసి ఆశ్చర్యపోయా. ఎవరైనా కూరగాయలు కోసే కత్తితో బైపాస్ సర్జరీ చేయాలనుకుంటారా?అని గతంలో మాజీ ప్రధానమంత్రి చంద్రశేఖర్ అన్నట్లుగా అలాంటి కత్తితో ఎవరూ అలా చేయరు. ఆ నోటీసు కనీసం కూరలు తరిగే కత్తి కూడా కాదు. పూర్తిగా తుప్పుపట్టింది. కాంగ్రెస్ నాకు వ్యతిరేకంగా చేస్తున్న అసత్య ప్రచారానికి వ్యక్తిగతంగా ఎంతో బాధపడ్డా. కానీ, నేను రైతు బిడ్డను.. ఎప్పటికీ బలహీనపడను' మీడియాముఖంగా ధన్కర్ పేర్కొన్నారు. డిసెంబరు 10 ఛైర్మన్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని.. ఆయనపై నమ్మకం లేదం టూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఐక్యసంఘటన జగదీప్ ధన్కర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి విదితమే.

## మణిపూర్ గవర్నర్‌గా అజయ్‌కుమార్ భల్లా

**న్యూదిల్లీ:** మణిపూర్ గవర్నర్‌గా మాజీ హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా నియమితులయ్యారు. మే 2003 నుంచి రాష్ట్రాన్ని కుదిపేస్తున్న జాతి హింస నేపథ్యంలో భల్లా నియామకం జరిగింది. ఇక మిజోరాం గవర్నర్‌గా ఉన్న డాక్టర్ హరిబాబు కంభంపాటి ఒడిశా గవర్నర్‌గా నియమితులయ్యారు. విజయ్ కుమార్ సింగ్ మిజోరాం గవర్నర్‌గా నియమితులయ్యారు. బీహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కేరళ గవర్నర్‌గా, కేరళ గవర్నర్‌గా ఉన్న ఆరిఫ్ మహ్మద్ ఖాన్ బీహార్ గవర్నర్‌గా నియమితులయ్యారు.

## మన జాలర్లను వెంటనే విడిపించండి

### జై శంకర్‌కు స్టాలిన్ లేఖ

**న్యూదిల్లీ:** శ్రీలంక నేవీ అదుపులోని భారత మత్స్యకారులు, వేట పడవులను త్వరగా విడిపించాలని కోరుతూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌కు ఒక లేఖ పంపారు. రామేశ్వరానికి చెందిన 17 మంది జాలర్లను శ్రీలంక నావికా దళం అదుపులోకి తీసుకున్నదని, రెండు వేట పడవులను సీజ్ చేసిందని తెలిపారు. మత్స్యకారులపై దాడులను జైశంకర్ దృష్టికి స్టాలిన్ తీసుకెళ్లారు. శ్రీలంకకు చెందిన ఆరుగురు వ్యక్తులు నాగపట్టణం జిల్లాలోని కొడియక్కరై గ్రామంలో మత్స్యకారులపై ఈనెల 20న దాడి చేశారని, దీంతో ముగ్గురు జాలర్లు గాయపడ్డారని, వారి బోట్లు, జీపీఎస్, వీహెచ్ఎఫ్ పరికరాలు, వలలతో పాటు పట్టుకున్న చేపలను సైతం ఆ గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లారని స్టాలిన్ పేర్కొన్నారు. ఇలాంటివి తరచూ జరుగుతుండటంతో సముద్రంలో వేటపైనే ఆధారపడే బతుకులకు భరోసా కరువవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఏడాదిలో 50 మంది మత్స్యకారులను శ్రీలంక అరెస్టు చేయగా, 71 పడవులు సీజ్ చేసిందన్నారు. తాజాగా అరెస్టు అయిన 17 మందిని వెంటనే విడిపించాలని, జాలర్లపై దాడులు నివారించేందుకు దౌత్య పద్ధతితో సత్వరమే చర్యలు తీసుకోవాలని లేఖలో స్టాలిన్ కోరారు.

## మోదీజీ... రైతులతో చర్చలెప్పుడు: భగవత్ మాన్

**చండీగఢ్:** న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరు బాట పట్టిన రైతన్నలతో చర్చలు జరిపేది ఎప్పుడు అంటూ కేంద్రాన్ని పంజాబ్ సీఎం భగవత్ మాన్ నిలదీశారు. మొండి వైఖరిని విడిచి వారితో తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) సారథ్యంలో రైతులు శంభు-ఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద ఆందోళన కొనసాగిస్తున్నారు. రైతుల డిమాండ్ల పరిష్కారానికిగాను కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దలేవాల్ 29రోజులుగా ఖనౌరీ వద్ద నిరాహారదీక్ష చేస్తున్నారు. కలిసి కట్టుగా ముందుకెళదాం...చివరి శ్వాస వరకు పోరాడుతా అంటూ ఆయన తోటి రైతన్నలకు పిలుపునిచ్చారు. దలేవాల్ 15 కిలోల బరువు తగ్గడం, కేన్సర్‌తో బాధపడుతుండటం వంటి అంశాలతో ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. రష్యా, ఉక్రేయిన్ యుద్ధాన్ని ఆపగలిగిన మోదీకి... రైతులతో మాట్లాడటం కష్టమా? ఏ ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారు?' అని ఎక్స్‌లో భగవత్ మాన్ ప్రశ్నించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.